RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

పీపుల్స్‌డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

సంపుటి : 18
సంచిక : 85
Vol : 18
Issue : 85

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

కరీంనగర్, మంగళవారం 26 మే 2026
Karimnagar, Tuesday 26 May 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00

WANTED

పీపుల్స్‌డైరీ

దినపత్రిక తెలంగాణ & ఏపీలోని వివిధ జిల్లాల్లో పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు కావలెను

సెంటర్లు

◆ హనుమకొండ ◆ కరీంనగర్
◆ భూపాలపల్లి ◆ పెద్దపల్లి/రామగుండం
◆ జనగామ ◆ మహబూబాబాద్
◆ హైదరాబాద్ ◆ నిజామాబాద్

Cell : 9493019044
9618509859

అధిక ఆదాయం ఉన్నవారికి రేషన్ కట్!

- తెలంగాణలో రేషన్ కార్డుల ఏరివేత..
- తప్పుడు సమాచారంతో పొందిన కార్డులు
- అనేకమంది అనర్హులు ఉన్నట్టు గుర్తింపు
- నిజమైన పేదలకు అందించడమే ప్రభుత్వ ఉద్దేశం

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణలో నిరుపేదలకు అందాల్సిన తెల్ల రేషన్ కార్డులను దుర్వినియోగం చేస్తున్న అనర్హులపై పౌరసరఫరాల శాఖ ఉక్కుపాదం మోపుతోంది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తప్పుడు సమాచారంతో కార్డులు పొంది ఇన్నాళ్లు దర్జాగా రేషన్ బియ్యాన్ని, ఇతర ప్రభుత్వ సదుపాయాలను అనుభవిస్తున్న వారి ఏరివేత ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఈ తనిఖీల్లో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న కొందరితో పాటు, నెలకు రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల వరకు భారీ వేతనాలు తీసుకునే సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల పేరిట కూడా తెల్ల రేషన్ కార్డులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఉమ్మడి కుటుంబం నుంచి విడిపోయి

(మిగతా 2లో...)

ప్రజా పాలన అంటే ఇదేనా?

- రేవంత్ సర్కార్‌పై హరీష్ ఫైర్
- వైద్య రంగ వైఫల్యాలపై హరీష్ రావు ట్వీట్

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైద్య సేవలు కుప్పకూలాయని మాజీ మంత్రి హరీష్ రావు ట్విట్టర్ వేదికగా ఆరోపించారు. తాండూరులో అంబులెన్స్ రాక రైల్వే ప్లాట్‌ఫారమ్‌పై మహిళ ప్రసవించడం, భద్రాచలంలో వాహనం లేక మృతదేహాన్ని భుజాలపై మోసుకెళ్లడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలో పేదల కోసం తెచ్చిన 108 అంబులెన్స్, పరమపద వాహనాలను నిర్వీర్యం చేశారని మండిపడుతూ.. ప్రజలు కోరుకున్న ప్రజా పాలన ఇదేనా అని ప్రశ్నించారు. తక్షణమే అత్యవ సర సేవలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

(మిగతా 2లో...)

ప్రభుత్వం చేతికి మెట్రో..

- మెట్రో యాజమాన్యం 100 శాతం వాటా బదిలీ
- ఇండియన్ రైల్వే ఫైనాన్స్‌తో తెలంగాణ ఒప్పందం
- రూ.13,600 కోట్ల రుణాల రీఫైనాన్స్‌కు అంగీకారం
- భవిష్యత్తులో మెట్రో విస్తరణకు అవకాశం

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ సర్వీసును పూర్తిగా స్వాధీనం చేసుకున్న తెలంగాణ ప్రభుత్వం .. ఆర్థికంగా బలోపేతం చేసేలా కీలక ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) మొత్తం రూ.13,600 కోట్ల రుణాలను రీఫైనాన్స్ చేసేందుకు అంగీకారం తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ సీఎండీ మనోజ్‌కుమార్ దూబె, తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే .రామకృష్ణారావు సమక్షంలో ఒప్పంద పత్రాలపై సోమవారం అధికారులు సంతకాలు చేశారు. ఈ రుణాన్ని 20 ఏళ్ల కాలపరిమితితో త్రైమాసిక పద్ధతిలో చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. హైదరాబాద్ మెట్రోలోని 100శాతం వాటా

(మిగతా 2లో...)

భారత్‌కు రష్యా మరో భారీ సాయం..

పాకిస్థాన్, చైనాకు బ్యాడ్ న్యూస్

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : భారత్ కు చిరకాల మిత్రదేశం రష్యా.. భారత్- రష్యా మధ్య సత్సంబంధాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. అంతర్జాతీయంగా ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా.. అమెరికా, చైనా లాంటి అగ్ర దేశాలు హెచ్చరించినా భారత్ మాత్రం రష్యా చేతిని అసలు విడిచిపెట్టలేదు. అలాగే భారత్ కు అతిపెద్ద రక్షణ భాగస్వామిగా రష్యా ఉంది. మన సైన్యంలో ఉన్న మెజారిటీ ఆయుధాలు, యుద్ధ విమానాలు రష్యా టెక్నాలజీతో కూడినవే.. బ్రహ్మోస్ క్షిపణి, ఎస్-400 వైమానిక రక్షణ వ్యవస్థల్ని భారత్.. రష్యా నుంచి కొనుగోలు చేసింది. అలాగే కేవలం ఆయుధాలతోనే పరిమితం కాకుండా భారత్ లోనే ఏకే-203 రైఫిళ్లు, సుఖోయ్ యుద్ధ విమానాల తయారీ వంటి మేక్ ఇన్ ఇండియా ప్రాజెక్ట్ లోనూ రష్యా భారత్ కు సహకారం అందిస్తోంది.

అలాగే రష్యా నుంచి భారత్ బారీ స్థాయిలో ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ప్రస్తుతం భారత్ కు ముడి చమురు సరఫరా చేసే దేశాల్లో రష్యా అగ్రస్థానంలో

(మిగతా 2లో...)

దశాబ్దాలుగా అంతుచిక్కని మిస్టరీ..

- అక్కడ మంచు కరిగితే పైకి తేలుతున్న అస్థిపంజరాలు..
- కారణాలను ఎవ్వరూ కనుగొనడం లేదు...

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : ఉత్తరాఖండ్‌లోని హిమాలయ పర్వతాల ఎత్తైన ప్రాంతంలో 'అస్థిపంజరాల సరస్సు'గా పలిచే రూప్‌కుండ్ సరస్సు అనే మిస్టీరియస్ లేక్ ఒకటి ఉంది. ఇది అక్కడి గర్హ్వాల్ ప్రాంతంలో సముద్ర మట్టానికి సుమారు 16 వేల అడుగుల కంటే ఎక్కువ ఎత్తులో ఉన్న ఈ హిమానీనద సరస్సులో మంచు కరిగినప్పుడల్లా వందలాది మానవ అస్థిపంజరాలు బయటపడుతుంటాయి. ఇలా దశాబ్దాలుగా జరుగుతుంది. అక్కడి వచ్చే సందర్శకులను భయపెడుతోన్న ఈ సరస్సు మిస్టరీ వెనుక అసలు కారణం ఏమిటో ఇంత వరకు ఎవ్వరూ కనుగొనలేకపోయారు.

కొందరు ఒక శాపం వల్ల ఇలా జరుగుతుందని నమ్ముతారు. మరికొందరు క్రీ.శ. 850 ప్రాంతంలో సంభవించిన

(మిగతా 2లో...)

నీరా'జనా'ల వెలుగులో త్రివేణి



- ఘాట్లపై గగనాన్నంటుతున్న ఘంటానాదం
- హృదయాలను నింపుతున్న హరహర శంభో నినాదం
- నమ్మకమే నదిగా మారి జనంలో ప్రవహించె...
- పాపాలన్నీ పారద్రోలే పుణ్యక్షణాలు...
- ఐదో రోజు కొనసాగిన పుష్కర స్నానాలు
- నాలుగైదు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న భక్తజనం
- అప్రమత్తంగా అధికార యంత్రాంగం

త్రివేణి సంగమం వద్ద భక్తి తరంగాలు ఉప్పొంగుతున్నాయి. పుష్కర మహోత్సవాల 5వ రోజు పవిత్ర స్నానాల కోసం లక్షలాది మంది భక్తులు పోటెత్తడంతో కాళేశ్వరం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడుతోంది. అంతర్వాహిని సరస్వతి సాక్షిగా త్రివేణి జలాల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు భక్తి భావంతో నీరాజనాలు అర్పిస్తూ దాన ధర్మాలలో పాల్గొంటున్నారు. మరోవైపు భక్తుల రద్దీ పెరుగుతుండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై, భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేసింది. పుష్కర ఘాట్ల వద్ద భక్తి, భద్రత, సేవా కార్యక్రమాలు సమన్వయంగా కొనసాగుతుండగా కాళేశ్వరం పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది.

పీపుల్స్‌డైరీ-భూపాలపల్లి

7వ పేజీలో..

ప్రజా పాలన అంటే ఇదేనా?

(మొదటి పేజీ తరువాయి)

'వికారాబాద్ జిల్లా తాండూరులో ఒక నిరుపేద గర్భిణీ స్త్రీ ప్రసవ వేదనతో తల్లడిల్లుతూ అత్యవసర సహాయం కోసం 108 అంబులెన్స్ సేవలకు పలుమార్లు ఫోన్ చేసింది. అయితే ఎన్నిసార్లు పిలిచినా అంబులెన్స్ సకాలంలో స్పందించకపోవడంతో విధిలేక ఆమె రైల్వే ప్లాట్‌ఫారమ్‌పైనే బిడ్డకు జన్మనివ్వాల్సి వచ్చింది. ఒక గర్భిణీకి కనీస వైద్య రవాణా సదుపాయం కల్పించలేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్ట' అని హరీష్ రావు దుయ్యబట్టారు. అలాగే భద్రాచలంలో జరిగిన మరో సంఘటన అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. ఒక నిరుపేద కుటుంబంలో వ్యక్తి మరణిస్తే మృతదేహాన్ని గౌరవప్రదంగా స్వగ్రామానికి తరలించేందుకు భద్రాచలం ఏరియా ఆసుపత్రి యాజమాన్యం కనీసం ఒక ఉచిత అంబులెన్స్ కూడా సమకూర్చలేదన్నారు. దీనితో ఆ పేద కుటుంబ సభ్యులు తమ బంధువు శవాన్ని భుజాలపైనే మోసుకుంటూ వెళ్లాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతికున్నప్పుడు ప్రాణాలు కాపాడటానికి అంబులెన్స్‌లు లేవు.. చనిపోయాక కనీస మానవీయ గౌరవంతో తీసుకెళ్లడానికి వాహనాలు లేవని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.

గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పేద, నిరుపేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు 108 అత్యవసర సేవల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు మృతదేహాలను ఉచితంగా తరలించేందుకు పరమపద వాహన సేవలను ప్రవేశపెట్టామని హరీష్ రావు గుర్తుచేశారు. నాడు పేదల పాలిట రక్షణ కవచాలుగా ఉన్న ఈ ఉచిత సేవలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిర్వీర్యం చేసిందని ఆయన ప్రశ్నించారు. ఇవి కేవలం పరిపాలనాపరమైన సాధారణ లోపాలు మాత్రమే కావని.. అత్యవసర పరిస్థితులు, అనారోగ్యం, ప్రసవాలు, మరణాల సమయంలో పూర్తిగా ప్రభుత్వ వైద్యంపైనే ఆధారపడే నిరుపేదల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి ఇవి నిలువెత్తు సాక్ష్యాలని మండిపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిద్ర మత్తు వీడి, తక్షణమే అత్యవసర ఆరోగ్య సేవలను పునరుద్ధరించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. అన్ని జిల్లాల్లో 108 అంబులెన్స్‌లు, శవవాహన సేవలు నిరంతరాయంగా, సక్రమంగా పనిచేసేలా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘోర పరిణామాలకు కారణమైన అధికారులను, వ్యవస్థలను జవాబుదారీలను చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలకు జీవితంలోనూ, అత్యవసర సమయాల్లోనూ, ఆఖరికి మరణంలోనూ కనీస మానవీయ గౌరవాన్ని పొందే హక్కు ఉందని దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ఆయన తన ట్వీట్‌లో స్పష్టం చేశారు.

ప్రభుత్వం చేతికి మెట్రో

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వానికి బదిలీ అయిందని చెప్పారు. "నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది.. దేశ ఆర్థికాభివృద్ధికి హైదరాబాద్ నగరం కీలక చోదకశక్తిగా ఎదుగుతోంది.. మెట్రో అనుసంధానం బలోపేతం వల్ల ట్రాఫిక్ తగ్గి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయి" అని తెలిపారు. ఈ సందర్భంగా రుణాన్ని రీఫైనాన్స్ చేసినందుకు సహకరించిన కేంద్రం, ఐఆర్ఎఫ్సీ, ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో సంస్థ బృందాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమర్థవంతమైన, సుస్థిరమైన ప్రజా రవాణా వ్యవస్థను విస్తరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ఈ ఫైనాన్సింగ్‌లో ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజులు, కమిట్‌మెంట్ ఛార్జీలు లేదా ముందస్తు చెల్లింపు జరిమానాలు లేవని ఐఆర్ఎఫ్‌సి స్పష్టం చేసింది. ఐఆర్ఎఫ్‌సికి చెల్లించాల్సిన బకాయిలను తీర్చడానికి తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన బేషరతు హామీ, రాష్ట్ర ప్రభుత్వ గ్యారెంటీ, ఆర్బీఐ మద్దతు కలిగి డైరెక్ట్ డెబిట్ ఆదేశాలు ఉన్నాయి.

హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్-1, మూడు కారిడార్లలో 57 స్టేషన్లతో 69.2 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (ప్రాప్రా) కింద అభివృద్ధి చేసిన ప్రపంచంలోని అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్టులలో ఇది ఒకటి. ఈ నెట్‌వర్క్ ప్రస్తుతం ప్రతిరోజూ ఐదు లక్షలకు పైగా ప్రయాణీకులను గమ్యస్థానాలకు చేర్చుతోంది. ఈ రీఫైనాన్సింగ్, మెట్రో నెట్‌వర్క్‌ను కొత్త కారిడార్లలోకి విస్తరించడానికి, హైదరాబాద్ మహానగర అంతటా లాస్ట్-మైల్ కనెక్టివిటీని మెరుగుపరచడానికి తెలంగాణ ప్రభుత్వ ప్రణాళికలకు కూడా మద్దతు ఇస్తుందని భావిస్తున్నారు.

దశాబ్దాలుగా అంతుచిక్కని మిస్టరీ!

(మొదటి పేజీ తరువాయి)

ఒక భారీ వడగళ్ల వానలో చిక్కుకుపోయిన పెద్ద సంఖ్యలో ప్రయాణికులు మరణించి ఉండవచ్చని భావిస్తారు. కానీ దీని వెనుక ఉన్న అసలు రహస్యం మాత్రం నేటికీ మిస్టరీగానే మిగిలిపోయింది.

మిస్టరీ లేక్ లేదా స్కెలిటన్స్ లేక్ అని కూడా పిలువబడే రూప్‌కుండ్ సరస్సుకు సుదీర్ఘ చరిత్ర కూడా ఉంది. దాని పరిసరాలు, చుట్టూ ఉన్న సహజ సౌందర్యాలు ఒక రహస్య, మర్మమైన అనుభూతిని కలిగిస్తాయి. నందా దేవి జాతీయ పార్కులో ఈ సరస్సు కూడా ఉంది. ఆ సరస్సు చాలా అందంగా ఉంటుంది.

దేవతల భూమిగా ప్రసిద్ధి చెందిన రూప్‌కుండ్ ఆకట్టుకునే పురాణ గాథలు, కథలకు నిలయంగా ఉంది. హిందూ విశ్వాసాల ప్రకారం బెడ్ని బుగ్యాల్ మైదానంలోనే ప్రాచీన వేదాలు లిఖించబడ్డాయని నమ్మకం. సమీపంలోని బెడ్ని కుండ్‌లోనే దుర్గాదేవి తన కలిఅవతారంలో మహిషాసురుడిని సంహరించిందని చెబుతారు. ఇది ఆ ప్రాంతానికి ఒక పవిత్రమైన వాతావరణాన్ని కల్పిస్తుంది.

మరో పురాణ కథనం ప్రకారం రాక్షసులతో పోరాడిన తరువాత పార్వతీ దేవి శుద్ధి చేసుకోవాలని కోరుకుంది. అందువల్ల శివుడు తన త్రిశూలంతో ఒక సరస్సును సృష్టించి, ఆమె స్నానం చేసేందుకు ఏర్పాటు చేశాడు. ఆ సరస్సులోని నీలి నీటిలో పార్వతి స్పష్టమైన ప్రతిబింబం కనిపించడం వల్ల దానికి రూప్‌కుండ్ అనే పేరు వచ్చిందనే మరో నానుడి ఉంది. కలు వినాయక్ కనుమ నుండి చేసే ట్రెక్ మార్గంలో మీరు రూప్‌కుండ్ అగ్నిపర్వత బిలాన్ని చూడవచ్చు. ఇక్కడే పార్వతి స్నానం చేస్తున్నప్పుడు వినాయకుడు కాపలాగా ఉన్నాడని అంటారు.

ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి నందా రాజ్ జాత్ యాత్ర జరుగుతుంది. ఈ ప్రదేశాన్ని నాలుగు కొమ్ములు గల ఒక రహస్యమైన పొట్టేలు సందర్శిస్తుందని, అది ఒక దివ్య స్వరూపమని చెబుతారు. ఇలా ఎన్నో జానపద కథలు, పురణ కథలు దీని చుట్టూ ఉన్నాయి. వేసవి కాలంలో రుతుపవనాలకు ముందు వచ్చే మే, జూన్ నెలల్లో ఈ ప్రదేశాన్ని సందర్శించడానికి ఉత్తమ సమయం.

అధిక ఆదాయం ఉన్న వారికి రేషన్ కట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేకంగా కొత్త కార్డులు మంజూరు చేయించుకున్న వారిలో ఈ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అధికంగా ఉన్నారు. ఇన్నాళ్లూ వీరంతా తమ తల్లిదండ్రుల రేషన్‌కార్డుల్లో సభ్యులుగా కొనసాగడం వల్ల వీరి అసలు వివరాలు, ఆదాయం బహిర్గతం కాలేదు. ప్రస్తుతం డేటా విశ్లేషణ ద్వారా వీరి గుట్టు రట్టవడంతో అలాంటి వారి కార్డులను అధికారులు తొలగిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తాజా నిబంధనల ప్రకారం.. లబ్ధిదారుల వార్షిక ఆదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువగా ఉండి, ఆదాయ పన్ను చెల్లిస్తున్న వారి కార్డులను తక్షణమే రద్దు చేస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 3.20 ఎకరాల కంటే ఎక్కువ తరి భూమి లేదా 7.20 ఎకరాల కంటే ఎక్కువ కుష్కి భూమి ఉన్న వారి రేషన్ కార్డులను కూడా ఏరివేస్తున్నారు. ప్రభుత్వ విచారణతో ఇన్నాళ్లూ లబ్ధి పొందిన అనర్హులైన కార్డుదారుల్లో ప్రస్తుతం తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

అనర్హుల ఏరివేత ప్రక్రియలో నిజమైన పేదలకు, అర్హులకు అన్యాయం జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వం పంపిన లబ్ధిదారుల ప్రాథమిక జాబితాలో సాంకేతిక పొరపాట్ల వల్ల కొందరు అర్హుల పేర్లు కూడా నమోదయ్యాయి. వార్షిక ఆదాయం రూ. 6 లక్షలుగా తప్పుగా చూపిస్తున్న వారి వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలిస్తున్నారు. మరికొందరు లబ్ధిదారులు బ్యాంకుల నుంచి వ్యాపార, వ్యక్తిగత రుణాలు పొందటం కోసం ఐటీ రిటర్న్స్‌లో లేని ఆదాయాన్ని ఉన్నట్లుగా చూపించినట్లు విచారణలో వెల్లడైంది. ఇలాంటి వారికి అధికారులు నేరుగా ఫోన్ చేసి వివరాలు సేకరిస్తున్నారు. లబ్ధిదారులు చెప్పిన సమాధానాలు, వారు సమర్పించిన పత్రాలపై విచారణ అధికారి సంతృప్తి చెందితే వారి కార్డులను యథావిధిగా కొనసాగిస్తున్నారు. అనుమానాస్పద కార్డుల విషయంలో అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారు చెప్పిన సమాచారం వాస్తవమా కాదా అనే అంశాన్ని అన్ని కోణాల్లో ఆరా తీస్తూ నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

భారత్‌కు రష్యా మరో భారీ సాయం..

(మొదటి పేజీ తరువాయి)

ఉంది. ఇదే కాక తమిళనాడులోని కూడంకుళం అణు విద్యుత్ కేంద్రం రష్యా సాంకేతిక సహకారంతోనే నిర్మించారు. అయితే తాజాగా మరో రంగంలోనూ భారత్ కు రష్యా సహకారం అందిస్తోంది. ప్రస్తుతం భారత్ లో బుల్లెట్ ట్రైన్స్, మెట్రోలు, హైవేలు, డిఫెన్స్ కారిడార్లు, స్మార్ట్ సిటీల నిర్మాణం కారణంగా ఉక్కు డిమాండ్ భారీగా పెరిగిపోయింది.

2030 నాటికి దేశీయ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని 220 మిలియన్ టన్నుల నుంచి 300 మిలియన్ టన్నులకు పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఉక్కు పరిశ్రమకు అత్యంత కీలకమైన కోకింగ్ బొగ్గు సరఫరాలో రష్యా భారత్ కు అండగా నిలవనుంది. ప్రస్తుతం భారత్ కోకింగ్ బొగ్గు కోసం ఎక్కువగా ఆస్ట్రేలియాపై ఆధారపడుతోంది. అయితే ఇప్పుడు రష్యా ప్రత్యామ్నాయంగా మారనుంది.

మరోవైపు ప్రపంచవ్యాప్తంగా ఉక్కు మార్కెట్, లోహాల ప్రాసెసింగ్, కీలక ఖనిజాల సరఫరా గొలుసుపై చైనాకు భారీ ఆధిపత్యం ఉంది. ఇప్పుడు ఈ రంగంలో భారత్-రష్యాల మధ్య బంధం బలపడితే చైనాపై ఆధారపడటం తగ్గుతుంది. అంతేకాక గ్లోబల్ మార్కెట్ లో చైనా ఆధిపత్యాన్ని తగ్గించినట్టుగా అవుతుంది. ఇది చైనాకు గట్టి ఎదురు దెబ్బగానే భావించాలి. ఇక యుద్ధ నౌకలు, ఫైటర్ జెట్లు, డిఫెన్స్ ఎక్విప్ మెంట్లు, హై-స్పీడ్ రైల్వేల్లో వాడే ప్రత్యేకమైన ఉక్కు తయారీలో రష్యాతో భారత్ భాగస్వామ్యం కానుంది. భారత్ అనేక రంగాల్లో రాణిస్తుండటం అటు పాకిస్థాన్ కు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది.

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పీపుల్స్‌డైరీ-హనుమకొండ : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలుగు వెలుగు సాహితీ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పొడిచెట్టి విష్ణువర్ధన్, చైర్మన్ పోలోజు రాజ్ కుమార్, జాతీయ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి, కార్యనిర్వహణ అధ్యక్షులు కాసుల కిరణ్ కుమార్, వేముల తిరుపతిరెడ్డిలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ స్ఫూర్తి నంది పురస్కారం,తెలంగాణ కీర్తి స్వర్ణ కంకణ పురస్కారం,తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి పురస్కారం,ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఉద్యమ పురస్కారం,కాళోజి సాహితీ సేవా పురస్కారం, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పురస్కారాలకు ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్పంచ్, ఉప సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఈవెంట్ ఆర్గనైజర్లు, ఈవెంట్ మేనేజర్లు, డ్యాన్స్ మాస్టర్లు, యాంకర్లు, సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, బ్రహ్మంగారి నాటక కళాకారులు, సంగీతం, నృత్యం, భరతనాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం .జానపదం. మిమిక్రీ, అవధానం, విద్య, వైద్య, ఇంద్రజాలం, ముకాభినయం, హరికథ,బుర్రకథ,ఒగ్గు కథ, రంగస్థల కళాకారులు, వాస్తు, జ్యోతిష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, భక్తి, పురోహితం, యోగా, కరాటే, వ్యవసాయం మ్యాజిక్ టీవీ కళాకారులు, డోలక్ హార్మోనియం, భజన కళ, సామాజిక సేవ, క్రీడ, షార్ట్ ఫిలిం, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థి, మహిళ, యువజన సంఘాలు,పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి,ప్రజా ప్రతినిధులు,వివిధ రంగాల్లో పని చేస్తున్న వారు ఈ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవచ్చని వారు తెలిపారు.పురస్కారాల ప్రధానోత్సవం జూన్ 14న హనుమకొండలోని టీఎన్జీవోస్ భవనంలో జరుగుతాయాన్నారు.మరిన్ని వివరాలకు 9100174351,9494400158 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పాలీసెట్ 2026 సరస్వతి ట్యుటోరియల్స్

విద్యార్థుల ప్రతిభ

పీపుల్స్‌డైరీ-హనుమకొండ : తెలంగాణలో పాలిటెక్నిక్ కళాశాల లో ప్రవేశాలకు నిర్వహించే పాలీసెట్ 2026 పరీక్షలో హనుమకొండ టైలర్ స్ట్రీట్ ప్రాంతానికి చెందిన సరస్వతి ట్యుటోరియల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచినట్లు ఆ సంస్థ నిర్వాహకుడు చరణ్ కుమార్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్యమ మార్కులు సాధించి సంస్థకు గుర్తింపు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్యార్థుల్లో సంగ వైష్ణవి 120 మార్కులకు గాను 104 మార్కులు సాధించగా సుశాంత్ 94 మార్కులు సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థుల కృషి తల్లిదండ్రుల సహకారం అధ్యాపకుల మార్గదర్శకత్వం కలిసి ఈ ఫలితాలకు కారణమయ్యాయని తెలిపారు. గత పది సంవత్సరాలుగా పాలీసెట్ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ అందిస్తూ అనేకమంది విద్యార్థులకు ఉన్నత స్థాయికి తీసుకెళ్ళేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని పేర్కొన్నారు. అలాగే గత సంవత్సరంలో తమ వద్ద శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులు కూడా అద్భుత ఫలితాలు సాధించినట్లు చరణ్ కుమార్ తెలిపారు. అందులో 120 మార్కులకు గాను కీర్తన 114, ప్రణీత్ 110, దీపిక 103, శ్రీవద 101, రాజ్ కుమార్ 100, సాయి తేజ 100, మోహిత 99, అజయ్ 97, మీనాక్షి 94, అభినయతేజ 91, మార్కులు సాధించినట్లు తెలిపారు తమ సంస్థ ద్వారా శిక్షణ పొందిన అనేకమంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీట్లు సాధించి విద్యా ప్రస్థానంలో ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు రానున్న రోజుల్లో కూడా మరింత మంది విద్యార్థులు లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆకాంక్షిస్తూ విజయం సాధించిన విద్యార్థులను కిరణ్ కుమార్ అభినందించారు.

సంగ వైష్ణవి

సుశాంత్

మహిళ వారోత్సవాలు ఘనంగా నిర్వహించాలి-జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి మే 25 పీపుల్స్ డైరీ.. ఐదు సంవత్సరాల లోపు చిన్నపిల్లలకు సమతుల్యమైన, పోషక విలువలు గల ఆహారం అందించి బాల్యాన్ని బలోపేతం చేయడం అంగన్వాడీ కేంద్రాల ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో తొలి రోజు సోమవారం ఐడీఓసీ కార్యాలయ ప్రాంగణంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో "సే నో టు జంక్ ఫుడ్" అనే నినాదంతో ప్రత్యేక ఫుడ్ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. స్థానికంగా లభించే కూరగాయలు, ఆకుకూరలు మరియు ఇతర పోషకాహార పదార్థాలతో తయారు చేసిన పిండి వంటలను ప్రదర్శిస్తూ వాటి పోషక విలువలను వివరించారు. ఈ స్టాల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించి వివిధ వంటకాల తయారీ విధానం, వాటి పోషక ప్రయోజనాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి అనే నినాదంతో నేటి నుండి ఈ నెల 30వ తేదీ వరకు మహిళా వారోత్సవాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. పిల్లలకు నాణ్యమైన, సమతుల్య ఆహారం అందించడం ద్వారా వారి శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బయట మార్కెట్లో లభించే జంక్ ఫుడ్‌ను చిన్నపిల్లలకు ఇవ్వకుండా, స్థానికంగా అందుబాటులో ఉన్న తాజా కూరగాయలు, ఆకుకూరలు, ధాన్యాలు వంటి పోషకాహారాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాలు ఈ దిశగా ముఖ్యపాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళలు, చిన్నపిల్లల కోసం వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేస్తున్న ఆయాలు, టీచర్లు మరియు పిల్లల తల్లిదండ్రుల కోసం వంటల పోటీలు కూడా నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ శ్రీమతి విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీమతి మల్లీశ్వరి, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతుల ను అరిగోస పెడుతున్న యజమాని..?

- డబ్బులిస్తే నే సంచులిస్తా
- కలెక్టర్ ఆదేశాలను బేకాతరు ..?
- గెరెపల్లి గ్రామ మొక్కజొన్న రైతుల ఆవేదన

సైదాపూర్ మే 25 (పీపుల్స్ డైరీ) : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని గెరెపల్లి తో పాటు పలు గ్రామాల మొక్కజొన్న రైతుల కొనుగోలు టెండర్ యజమాని. పుల్లూరి వేణుగోపాల్ తీరుతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ పది రోజుల్లో మొక్కజొన్న కొనుగోళ్లు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ.. స్థానిక టెండర్ యజమాని పుల్లూరి వేణుగోపాల్ మాత్రం రైతులను పట్టించు కోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మీ ఊరికి సంచులు ఇవ్వను.. లిమక్కలు ఎప్పుడు తీసుకుంటామో తెలియదు.. మీకు ఇష్టం వచ్చినట్టు చేసుకోండి" డబ్బులిస్తేనే సంచు లిస్తా అంటూ రైతులతో దురుసుగా మాట్లాడుత ున్నాడని రైతులు వాపోతున్నారు. రోహిణి కార్తి ప్రారంభమైన వేళ పంటను అమ్మేందుకు సిద్ధంగా ఉన్న రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద రోజులు గడుపుతున్నా ఎలాంటి స్పందన లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకవైపు అధికారులు, నాయకులు రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరగాలని చెబుతుంటే.. మరోవైపు టెండర్ యజమాని నిర్లక్ష్య ధోరణి ఎందుకు కొనసాగుతోందని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతు అంటే దేశానికి వెన్నెముక అంటున్న ప్రభుత్వం.. రైతుల కష్టాలను పట్టించుకోకపోతే ఎలా అని మండిపడు తున్నారు. వెంటనే అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో సంచులు అందుబాటులో ఉంచి మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ఇసుక లేక ఇందిరమ్మ ఇండ్ల బ్రేక్ -ఆన్‌లైన్ ఆలస్యంతో లబ్ధిదారుల ఆవేదన

పట్టించుకోని అధికారులు?

సైదాపూర్, మే 25:(పీపుల్స్ డైరీ) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులు, నాయకులు ఆదేశాలు ఇస్తుండగా... మరోవైపు ఇసుక ఆన్‌లైన్ సమస్యలతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలో ఇసుక అందుబాటులో లేక ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని బాధితులు వాపోతున్నారు. కొన్ని రోజుల పాటు ఇసుక ఆన్‌లైన్‌లు కాకపోవడం , తర్వాత ఒక్కసారిగా భారీగా అనుమతులు రావడంతో ట్రాక్టర్లు, కార్మికులు అందుబాటులో లేక పనులు ఆగిపోతున్నాయని చెబుతున్నారు. దీంతో భవన నిర్మాణ కార్మికులు కూడా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొంటున్నారు. "ఇసుక ఆన్‌లైన్ నిరంతర ప్రక్రియగా ఉంటే పనులు సజావుగా సాగుతాయి. కానీ ఒక్కసారిగా ఆన్‌లైన కాకుండా యజమానులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు" అని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక అధికారులు మాత్రం నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలని ఒత్తిడి తీసుకురావడంపై లబ్ధిదారులలో ఆందోళన వ్యక్తమవుతు న్నాయి. ఇది ప్రభుత్వ వైఫల్యమా..? సాంకేతిక లోపాల ప్రభావమా..? అధికారుల సమన్వయ లోపమా..? అనే చర్చ. మండలంలో జోరుగా . సాగుతుంది

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఆవేదన-బకాయిలు చెల్లించాలంటూ ధర్నా

- సారధ్య కమిటీ పిలుపుమేరకు హుజురాబాద్ డిపో మేనేజర్ కు మెమోరాండం సమర్పణ

హుజురాబాద్ టౌన్ మే 25 (పీపుల్స్ డైరీ) : 35 నుండి 40 సంవత్సరాల పాటు ఆర్టీసీలో వివిధ హోదాలలో పనిచేసి రిటైర్ అయిన తమకు రావాల్సిన రిటైర్మెంట్ బకాయిలు, ఆర్‌పీఎస్ 2017 బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సారధ్య కమిటీ ఆధ్వర్యంలో సోమవారం డిపో వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. సారధ్య కమిటీ పిలుపుమేరకు హుజురాబాద్ డిపో మేనేజర్ కు సమస్యలతో కూడిన మెమోరాండం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల ప్రతినిధులు మాట్లాడుతూ... ఆర్‌పీఎస్ 2017 సవరణను ఏప్రిల్ 2024 నుండి సర్వీసులో ఉన్న ఉద్యోగులకు వర్తింపజేశారని, కానీ తాము రిటైర్ అయి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా తమ కష్టార్జితం తమకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు వస్తాయని ఎదురుచూస్తూ ఇప్పటికే 289 మంది విశ్రాంత ఉద్యోగులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ముఖ్య డిమాండ్లు:

ఆర్‌పీఎస్ 2017 బకాయిలు: సర్కులర్ నెంబర్ పీడీ-11/2024 07.06.2024) ప్రకారం 2017 ఏప్రిల్ నుండి రిటైర్ అయిన వారందరికీ రావాల్సిన ఆర్‌పీఎస్ 2017 బకాయిలను వెంటనే చెల్లించాలి. గ్రాట్యుటీ, సెలవుల నగదు మార్పిడి వ్యత్యాసం: 2017 ఏప్రిల్ నుండి 2024 ఏప్రిల్ వరకు రిటైర్ అయిన వారికి పాత 2013 ఆర్‌పీఎస్ ప్రకారమే గ్రాట్యుటీ, సెలవుల నగదు మార్పిడి డబ్బులు ఇచ్చారు. వీరికి ఆర్‌పీఎస్ 2017 సవరించిన వ్యత్యాసపు మొత్తాన్ని చెల్లించాలి. వీటికి ఆడిట్ పూర్తయి 'చెల్లింపునకు సిద్ధం'గా ఉన్నప్పటికీ నిధులు విడుదల చేయడం లేదు. ఇటీవల బకాయిలు: 2024 సెప్టెంబర్ నుండి రిటైర్ అయిన వారికి సెలవుల నగదు మార్పిడి, అలాగే 2025 నవంబర్ నుండి రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ మరియు చివరి నెల జీతం ఇంతవరకు చెల్లించలేదు, వాటిని తక్షణమే చెల్లించాలి. పీఎఫ్ సమస్యలు: పీఎఫ్ కు సంబంధించి డీడీలు చెల్లించినా పెన్షన్ తిరస్కరణకు గురైన వారు, డిమాండ్ నోటీసులు రాక ఇబ్బంది పడుతున్న వారి సమస్యలను పరిష్కరించాలి. వైద్య, ప్రయాణ సౌకర్యాలు: తార్నాక ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు సక్రమంగా కల్పించాలని, సూపర్ లగ్జరీ బస్సులలో ప్రయాణానికి ఉచిత అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో జరిగిన సమ్మె డిమాండ్లలో కూడా రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు ఇవ్వాలనే విషయాన్ని యాజమాన్యం అంగీకరించిందని వారు గుర్తుచేశారు. ఈ సమస్యలన్నింటినీ హుజురాబాద్ డిపో మేనేజర్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తమకు న్యాయం జరిగేలా సహకరించాలని తెలంగాణ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సారధ్య కమిటీ కోరింది.

నివాస అనుమతులతో హాస్పటల్ నిర్మాణం సబబేనా?

- రిచ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను వెంటనే సీజ్ చేయాలి:
- భవనానికి సెల్లార్ అనుమతి ఉందా?:
- అక్రమ నిర్మాణ సంస్థపై సమగ్ర విచారణ జరపాలి - రమణి మాల్యాల..

కుత్బుల్లాపూర్ ప్రతినిధి , మే 25: బాచుపల్లి కేజీఎం కాలనీలో నివాస గృహ నిర్మాణానికి మంజూరు చేసిన అనుమతులతో భారీ హాస్పటల్ ను ఏర్పాటు చేసారని ఆరోపిస్తూ ఆశా జ్యోతి మహిళా వేదిక అధ్యక్షురాలు రమణి మాల్యాల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె సంబంధిత అధికారులకు ఫిర్యాదు సమర్పించారు. సర్వే నంబర్లు 111, 112 పరిధిలోని ప్లాట్ నంబర్ 38లో "రీచ్ బహుళ వైద్య సేవల ఆసుపత్రి" పేరుతో నిర్మాణం జరుగుతోందని, దీనికి అక్రమ నిర్మాణ సంస్థ నిజాంపేట్ కార్పొరేషన్ నుంచి నివాస గృహ నిర్మాణ అనుమతి పొందిందని వివరించారు. అనంతరం అదే నిర్మాణానికి వినియోగ ధృవపత్రం కూడా జారీ చేయడం పలు అనుమానాలకు తావిస్తోందని పేర్కొన్నారు. అనుమతి పత్రాల్లో స్థల విస్తీర్ణాన్ని 792 చదరపు గజాలుగా చూపించినప్పటికీ, అసలు ప్రణాళిక ప్రకారం ప్లాట్ నంబర్ 38 కేవలం 226 చదరపు గజాలే ఉందని ఆరోపించారు. అలాగే ఆసుపత్రి నిర్మాణం సమీప కాలువకు 15 నుంచి 30 మీటర్ల పరిధిలో ఉండటం వల్ల ఇది రక్షిత మండల నిబంధనలకు విరుద్ధంగా ఉండే అవకాశముందని పేర్కొన్నారు. ఈ నిర్మాణంపై మహానగర అభివృద్ధి సంస్థ అధికారులు సమగ్ర పరిశీలన చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్లాట్ నంబర్ 38 పేరుతో నిర్మాణం చేపడుతూ సమీపంలోని 37, 39, 40 ప్లాట్లను కూడా ఆక్రమించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. నివాస గృహ నిర్మాణ అనుమతులతో నాలుగు అంతస్తుల భవనానికి అనుమతి తీసుకుని, తర్వాత దానిని వాణిజ్య వైద్యశాలగా వినియోగించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఇంకా ఈ భవనానికి వ్యాపార అనుమతి మంజూరు చేయడంపై కూడా ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నివాస గృహానికి వ్యాపార అనుమతి ఎలా జారీ చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలని, సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణ భద్రతకు ముప్పు కలిగించే విధంగా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని రమణి మాల్యాల హెచ్చరించారు. అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వం, కార్పొరేషన్, మహానగర అభివృద్ధి సంస్థ అధికారులు తక్షణమే సమగ్ర విచారణ జరిపి నిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ధర్నా!

భూపాలపల్లి మే 25 పీపుల్స్ డైరీ : పదేళ్లుగా బకాయిలు చెల్లిం చకుండా ఆర్‌టీసీ యాజమాన్యం వేధిస్తుందని, తమకు చావే దిక్కని ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగులు డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు. ఆర్‌టీసీలో వివిధ విభాగాల్లో పని చేసి రిటైర్డ్ అయిన తమకు 2017 నుంచి ఇప్పటి వరకు బకాయిలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఆర్‌పీఎస్ 2017, ఏరియర్స్ 2024 వరకు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు ఇవ్వలేదని, అప్పులు తీరక పిల్లల పెళ్లిళ్లు చేయలేక అనారోగ్య కారణాల వల్ల మానసికంగా ఇబ్బం దులు పడుతున్నామని, ఈపీఎఫ్ఓ తిరస్కరణకు గురి చేసి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. తమకు రావలసిన పి ఎఫ్, ఫెన్షన్, మెడికల్ సౌకర్యాలు సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణ సమస్యలు వెంటనే పరిష్కరించాలని భూపాలపల్లి డిపో మేనేజర్ కు వినతి పత్రం సమర్పించారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

ఉపాధి పనులను పరిశీలించిన సర్పంచ్ కాడవేణి సరిత-యుగేందర్

రేగొండ మే 25 పీపుల్స్ డైరీ.. గోరికొత్తపల్లి మండలం వెంకటేశ్వర్ల పల్లి గ్రామంలోని సీతారాం కుంట ప్రాంతంలో సాగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను గ్రామ సర్పంచ్ కడవేణి సరిత- యుగేందర్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మండుటెండల్లో పనిచేస్తున్న కూలీల దాహార్తినీ తీర్చేందుకు చల్లని మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. వేసవి తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 5 గంటల నుండి 10 గంటల లోపే పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. కార్మికులకు చల్లటి తాగునీరు నిరంతరం అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ ను ఆదేశించారు. పనుల పరిశీలనకు వచ్చిన ఏపీవో దివాసి విటల్ తో సర్పంచి మాట్లాడుతూ. కూలీల వేతనాలను త్వరగా జమ చేయాలని, తొలగించిన జాబు కార్డుల పేద కుటుంబాలకు వెంటనే పని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పొన్నం రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ పనస శంకర్, మరియు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులు సంగారెడ్డి జిల్లా పర్యటన

సంగారెడ్డి మే 25 పీపుల్స్ డైరీ :- పర్యటన లో భాగంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలో 32 లక్షల 23 వేల రూపాయల కంపా నిధులతో నిర్మించిన అటవీ శాఖ బీట్ ఆఫీసర్స్ వసతి గృహాలను ప్రారంభించారు. అనంతరం, ఒక 1కోటి 44 లక్షల రూపాయల సీ ఏ - పిడిఎఫ్ నిధులతో నిర్మించిన జిల్లా పరిరక్షణ అధికారి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో అడవుల పరిరక్షణ, వాతావరణ సమతుల్యతకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. జిల్లాలో అందులో భాగంగా అర్బన్ ఎకో పార్కులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ లలో అర్బన్ ఎకో పార్కులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో అటవీశాఖ జిల్లా సంరక్షణ అధికారి కార్యాలయాన్ని నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి సువర్ణ, పీసీసీఫ్ ప్రియాంక వర్గీస్, టీజీక్ చైర్ పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరతోష్ పంకజ్, మున్సిపాలిటీ చైర్పర్సన్ వనిత సంతోష్, సదాశివ పేట చైర్ పర్సన్ అంజమ్మ సత్యనారాయణ, జిల్లా అటవీ శాఖ సంరక్షణ అధికారి ప్రసాద్ రెడ్డి, డిఎస్పీ సత్తయ్య, ఎఫ్ ఆర్ ఓ దేవీలాల్ , స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఊరి కోసం ఒక్క రోజు పారిశుద్ధ్యం చేద్దాం

ఉప సర్పంచ్ రాపర్తి సంధ్య కొమురయ్య

వీణవంక మే 26(పీపుల్స్ డైరీ) : మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఉన్న ఊరు కన్నతల్లి లాంటిది అని ఊరు కోసం ఒక్కరోజు ఐన పారిశుద్ధ్యం చేద్దాం అని శుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దుకుందాం అనే లక్ష్యంతో మన పోతిరెడ్డిపల్లి గ్రామాన్ని శుభ్రంగా ఆరోగ్యవంతంగా మార్చేందుకు కృషి చేయాలి అని ఉప సర్పంచ్ రాపర్తి సంధ్య మాట్లాడుతూ మన గ్రామంలో ముందస్తు వచ్చే వర్షాకాలంలో రోడ్లు డ్రైనేజీ కాలువలు నీరు నిలువ ఉండే ప్రదేశాలు శుభ్రంగా ఉండే విధంగా మన గ్రామం ఉండాలని ఉన్న ఊరు కోసం ఒక్క రోజు ఐన పారిశుద్ధ్యం కార్యక్రమం చెయ్యాలని ఆలోచనతో గ్రామపంచాయతీ పాలకవర్గ గ్రామ ప్రజలు అందరు ముందుకు రావాలని మన గ్రామాన్ని మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు తాళ్లపెల్లి పుష్పలీల చందుపట్ల శ్రీధర్ రెడ్డి చేపూరి శ్రీకాంత్ మాజీ సర్పంచ్ పానుగంటి మధుకర్ మాజీ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు దుర్గం బిక్షపతి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు రాపర్తి రవి తాళ్లపల్లి శ్రీనివాస్ రాపర్తి కొండల్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

ప్రతి శిశువును పదిలంగా కాపాడుకుంటాం

సీడీపీఓ స్వరూప

భీమదేవరపల్లి మే 25 (పీపుల్స్ డైరీ) : ప్రతి శిశువు ఆరోగ్యంగా, సురక్షితంగా ఎదగడానికి అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని భీమదేవరపల్లి సీడీపీఓ స్వరూప పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులోని రెండవ అంగన్‌వాడీ కేంద్రంలో "ప్రజా పాలన -- 90 రోజుల కార్యక్రమం"లో భాగంగా పోషకాహార మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భధారణ దశ నుంచే శిశువుకు ప్రాథమిక విద్య అందే వరకు అంగన్‌వాడీ కేంద్రాలు తల్లి పాత్రను పోషిస్తాయని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు,చిన్నారులకు సమతుల్య ఆహారం, పోషకాహారం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని అన్నారు. తల్లి, శిశువుల ఆరోగ్య పరిరక్షణలో పోషకాహారం ఎంతో ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, ముల్కనూర్ పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోత్స్న, సూపర్వైజర్ అనిత, ఏఎన్ఎం కళ, వార్డు సభ్యుడు అనిల్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

మార్కెట్ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం చేతుల మీదుగా రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీ

జమ్మికుంట మే 25 పీపుల్స్ డైరీ : జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలోని జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాలకు చెందిన రైతులకు 50 శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను సోమవారం నుండి పంపిణీ చేస్తున్నట్లు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం తెలిపారు. జమ్మికుంట మున్సిపల్ పరిధి కొత్తపల్లి లోని రైతు ఆగ్రోస్ ఎరువుల దుకాణంలో సోమవారం సబ్సిడీపై జీలుగ విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం మాట్లాడుతూ... రాష్ట్రంలోను కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు. పంట ప్రారంభానికి ముందు వ్యవసాయ భూములలో పోషక విలువలను పెంచేందుకు జీలుగ విత్తనాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. జమ్మికుంట ఇల్లందకుంట వీణవంక మండలాలలో మండలానికి 280 క్వింటాళ్ల చొప్పున జీలుగ విత్తనాలు సబ్సిడీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. 30 కేజీల బ్యాగు ధర రూ.2,453 లు అని, 30 కిలోల సంచి రెండున్నర ఎకరాల వరకు వేసుకోవచ్చని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, జమ్మికుంట మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, పిఎసిఎస్ జమ్మికుంట చైర్మన్ పొనగంటి సంపత్, మార్కెట్ సూపర్వైజర్ బాబా, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

శంకరపట్నం మండలంలో ప్రజా పాలన ప్రగతి

శంకరపట్నం మే:25 పీపుల్స్ డైరీ: శంకరపట్నం మండలం మొలంగూర్ గ్రామం లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక,ఉమెన్స్ వీక్ లో భాగంగా పిల్లల యుక్త వయసు బాలబాలికల పోషకాహారాస్థితి మెరుగు పరచడానికి స్థానికంగా దొరికే ఆహారాలపై అవగాహనా కల్పించడంమరియు తక్కువ ఖర్చుతో దొరికే ఆహారాలు మరియు వంటకాలప్రదర్శన, గర్భి,ణీ స్త్రీ లకు ఎనిమియా టెస్ట్,ప్లేడ్జ్ సూపెర్వైసర్ చెన్నూరి పద్మ గారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో మొలంగూర్ గ్రామ సర్పంచ్ పూదరి రాజు, వార్డ్ మెంబర్ పాలకు తిరుపతి ఏఎన్ఎం గీత అంగన్వాడి టీచర్లు అయలు ఆశాలు గర్భిణీ స్త్రీలు తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలలో చోరీ నగదు ఎత్తుకపోయిన దొంగలు

నాలుగు నిమిషాల లోనే రెండు దుకాణాల్లో చోరీ

ఏటూరు నాగారం మే 25 (పీపుల్స్ డైరీ) : ములుగు జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి. జాతీయ రహదారిపై నిత్యం వాహనాలతో సందడి ఉండగానే దొంగలు రెండు మద్యం షాపులలో దొంగతనానికి పాల్పడ్డారు. పెద్దమ్మ తల్లి మద్యం దుకాణంలో మూడు గంటల 32 నిమిషాలకు, రెడ్డి మద్యం దుకాణాలను మూడు గంటల 36 నిమిషాలకు చోరీ జరిగినట్లు సీసీ కెమెరాలు నమోదయింది. కేవలం నాలుగు నిమిషాలలోనే దొంగలు రెండు దుకాణంలో చోరీ చేయడం చూస్తుంటే దొంగలు రెండు గ్రూపులుగా విడిపోయి దొంగతనానికి పాల్పడినట్లు స్పష్టమవుతున్నది. ఇనుప రాడ్లతో తాళాలను పగలకొట్టడమే కాకుండా ఇనుప చువ్వలను కోసి చోరీకి పాల్పడ్డారు. రెడ్డి వైన్స్ లో 45 వేల రూపాయల నగదు, పెద్దమ్మ తల్లి వైన్స్ లో 25వేల రూపాయల నగదును దొంగలు తీసుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులు డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ను రప్పించి రికార్డు నమోదు చేశారు. మద్యం వ్యాపార యజమానులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానిక ఎస్సై ఉపేందర్ తెలిపారు. కాగా గత కొద్ది నెలల క్రితమే రెడ్డి వైన్స్ లో చోరీకి పాల్పడిన వ్యక్తులను గుర్తించి కేసు నమోదు చేసినప్పటికీ తిరిగి దొంగతనాలు జరగడం యజమానులలో వణుకు పుట్టిస్తున్నది.

బెల్ట్ షాపులను వెంటనే రద్దు చేయాలి

బీజేపీ నాయకులు మాడుగుల అజిత్ కుమార్ డిమాండ్

భీమదేవరపల్లి మే 25(పీపుల్స్ డైరీ) : ముల్కనూర్ గ్రామంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న అక్రమ బెల్ట్ షాపుల వ్యవస్థపై గ్రామ పాలకవర్గం వెంటనే స్పందించి, కఠిన చర్యలు తీసుకోవాలని భీమదేవరపల్లి మండల బీజేపీ నాయకులు మాడుగుల అజిత్ కుమార్ డిమాండ్ చేశారు. గ్రామ భవిష్యత్తు, యువత ఆరోగ్యం, పేద కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ సమస్యపై తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అధికారిక వైన్స్ షాపుల కంటే భిన్నంగా బెల్ట్ షాపుల్లో మద్యం ధరలను విపరీతంగా పెంచి అమ్ముతున్నారు. ఒక్కో క్వార్టర్ సీసాపై 50,ఒక్కో బీరుపై 60 వరకులిలి అదనంగా వసూలు చేస్తూ సామాన్యులను నిలువునా దోచుకుంటున్నారన్నారు. రోజంతా చెమటోడ్చి కష్టపడే పేద, కూలి జనాలు సంపాదించిన డబ్బు సాయంత్రానికి ఈ బెల్ట్ షాపుల పాలవుతోంది. దీనివల్ల ఎన్నో పేద కుటుంబాలు ఆర్థికంగా రోడ్డున పడుతున్నాయి. ప్రభుత్వ గుర్తింపు పొందిన వైన్స్ షాపులకు సమయ పాలన ఉంటే, గ్రామాల్లోని బెల్ట్ షాపులు మాత్రం ఎలాంటి నియంత్రణ లేకుండా 24ఐ7 అహోరాత్రులు నడుస్తున్నాయి. దీనివల్ల గ్రామంలోని యువత సులభంగా వ్యసనాల బారిన పడి తమ బంగారు భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారు. ఈ విమర్శలు ఎవరినో వ్యక్తిగతంగా దూషిం చడానికి చేస్తున్నవి కావు. కేవలం మన ముల్కనూర్ గ్రామ భవిష్యత్తు, మన యువత, ప్రజల ఆరోగ్యం కోసం మాత్రమే మేము ప్రశ్నిస్తున్నామని తెలిపారు. కావున, ముల్కనూర్ గ్రామ పాలకవర్గం ఈ బెల్ట్ షాపుల నిర్మూలనను ఒక ప్రత్యేకమైన బాధ్యతగా స్వీకరించాలని, గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు జరగకుండా తక్షణమే కఠినమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు

ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు

ఇల్లంతకుంట. మే 25 పీపుల్స్ డైరీ : ఇల్లంతకుంట మండల పరిధిలోని రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను అవసరం ఉన్నటువంటి రైతులు కొనుగోలు చేయాలని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానశీ చైర్మన్ ఇంగిలే రామారావు రైతులను కోరారు. జీలుగ బస్తా మొత్తం ధర 4905 రూపాయలు 50% సబ్సిడీ పోను 2452.50 రూపాయలు. వరిపొలం నాటు వేసే ముందు జీలుగు విత్తనాలను చల్లుకొని అవి పెరిగిన తర్వాత దున్ని నాటు వేసినట్లయితే వరి అధిగ దిగుబడిని పొందవచ్చునని అన్నారు. జీలుగ విత్తనాలు అవసరం ఉన్న రైతులు పట్టాదారు పాస్ పుస్తకం జిరాక్స్ కాపీ తీసుకొని ఇల్లంతకుంట లోని డీసీఎంఎస్ కాంప్లెక్స్ లక్ష్మన్నపల్లి 200 బ్యాగులు, రాచపల్లి 200 బ్యాగులు, మల్యాల133 బ్యాగులు సిరిసేడు 200 బ్యాగులు దాదాపు మొత్తం 930 బస్తాలు ఈ పై గ్రామాలలో జీలుగు బత్తాలు అందుబాటులో ఉన్నవి. 50% సబ్సిడీతో ఒక బస్తా 30 కిలోల బ్యాగు 2452 రూపాయలుగా ధర నిర్ణయించడం జరిగింది. ఒక బస్తా దాదాపు రెండున్నర ఎకరాలకు సరిపోతుంది. జీలగ విత్తనాలను చల్లడం ద్వారా పచ్చిరొట్ట ఎరువు లాగా పని చేస్తుందని అలాగే పంట దిగుబడి ఎక్కువ వస్తుందని అన్నారు. జీలుగు విత్తనాలను రైతులకు సరఫరా చేయడంలో వ్యవసాయ అధికారులు పూర్తిగా నిమగ్నమయ్యారు అన్నారు. రైతులకు ఎలాంటి అవసరాలు ఉన్న సంబంధిత వ్యవసాయ శాఖ ఏఓ, ఏఈఓ ని సంప్రదించాలన్నారు.

కరకట్ట నిర్మాణం కోసమై శాంతియుత పోరాటనికి సన్నద్ధం

- **గోదావరి ముంపుతో కోతకు గురికాకుండా కరకట్ట నిర్మాణం కోసమై శాంతియుత పోరాటం చేయడానికి సన్నద్ధం**

ఏటూరు నాగారం మే 25 (పీపుల్స్ డైరీ) : మన ప్రియతమ నాయకులు ములుగు జిల్లా బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులు మర్రి లక్ష్మణ్ బాబు గోదావరి ముంపుతో కోతకు గురికాకుండా కరకట్ట నిర్మాణం కోసమై శాంతియుత పోరాటం చేయడానికి మన ప్రియతమ నాయకులు ములుగు జిల్లా బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులు మర్రి లక్ష్మణ్ బాబు సన్నద్ధమవుతున్నారు. ముల్లకట్ట బ్రిడ్జి దగ్గర నుండి ముల్లకట్ట, శంకరాజుపల్లి, రొయ్యూరు, ఏటూరునాగారం, రామన్నగూడెం గ్రామాల్లో గల రైతుల భూములు గోదావరి ముంపుతో కోతకు గురికాకుండా కరకట్ట నిర్మాణం కోసమై శాంతియుత పోరాటం చేయడానికి మన ప్రియతమ నాయకులు ములుగు జిల్లా బి ఆర్ ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులు మర్రి లక్ష్మణ్ బాబు సన్నద్ధమవుతున్నారు. ముల్లకట్ట బ్రిడ్జి దగ్గర నుండి పాదయాత్ర చేయడానికి ప్రణాళిక సిద్ధం అవుతోంది. కావున గోదావరి వరద ముంపునకు గురి అయ్యే వ్యవసాయ భూమి రైతులందరు మరియు ప్రజలు ఈ పాదయాత్రలో పాల్గొనవలసింది గా కోరడమైనది. అదేవిధంగా ఏటూరు నాగారం నుండి ముల్లకట్ట వరకు ఉన్న నేషనల్ హైవే రోడ్డు కు కూడా గోదావరి వరదల వల్ల ముప్పు పొంచి ఉంది. ఇపుడు కాకున్నా భవిష్యత్తు లో గోదావరి ఒడ్డు కోతకు గురి అయ్యి నేషనల్ హైవే రోడ్డు కు సమీపించి హైవే రోడ్డు ప్రమాదటంచులకు చేరువ వుతుంది. గోదావరి నది ఒడ్డుకు కరకట్ట నిర్మాణం చేపడితే తప్ప రైతుల భూములు మరియు నేషనల్ హైవే రోడ్డు కు హాని కలుగకుండా ఉంటుంది. వర్షాలు, వరదల సమయంలో పాలక ప్రభుత్వాలు ఫలితంలేని హామీలు ఇచ్చి రామన్నగూడెం సమీపం లో ఇసుక బస్తాలు వేస్తూ కాలం వెళ్ళదీస్తున్నాయి. ముల్లకట్ట, శంకరాజుపల్లి, రోహీర్, రామన్నగూడెం, ఏటూరునాగారం గ్రామాల గోదావరి నది తీరం వెంబడి కరకట్ట నిర్మాణ ఆవశ్యకత ఎంతైనా ఉంది. కరకట్ట నిర్మాణం కోసమై రైతులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొని పాదయాత్రను విజయవంతం చేసి కరకట్ట నిర్మాణంలో పాత్రులు కావాలి. పాదయాత్ర తేదీ ని త్వరలో తెలియజేస్తామనీ తెలిపారు.

ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా ఉండి పాసుబుక్కు లేని రైతులకు పాసుబుక్కులు ఇవ్వాలి

- **తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం**

ములుగు జిల్లా అధ్యక్షులు దుగ్గి చిరంజీవి

ఏటూరు నాగారం మే 25 (పీపుల్స్ డైరీ) : సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా స్థానిక ఐటీడీఏ కేంద్రంలోనీ సమావేశం మందిరం లో ఏపీఓ కి పోడు పట్టా నంబరు ఉండి రైతు భరోసా వస్తున్న రైతులందరికీ పట్టా పాస్ బుక్కులు ఇవ్వాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూబి తాడువాయి మండలం గంగారం పంచాయతీలో గౌరబోయిన పరమయతో పాటు 30 మంది పోడు సాగు రైతులు వారికి పోడు పట్టా వచ్చినట్టుగా రికార్డులో ఆర్ ఓ ఎఫ్ ఆర్ నెంబర్ నమోదయింది, గత బిఆర్ఎస్ ప్రభుత్వం కాలం నుండే రైతు భరోసా కూడా వస్తున్నది ప్రస్తుతం కూడా వారికి రైతు భరోసా అందుతున్నది. కానీ వారికి పట్టా బుక్కు లేనందున అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నదని, అదేవిధంగా ప్రస్తుతం మందు కట్టాలు తీసుకోవాలన్న పట్టా పాస్ బుక్కు అవసరం కాబట్టి వాళు మందు కట్టాలి తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతున్నది. అదేవిధంగా ఫారెస్ట్ అధికారులతో కూడా పట్టా పాస్ బుక్కులు లేనందున ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. బ్యాంకు లోన్ తీసుకుందాం అనుకున్నా కూడా తీసుకోలేని పరిస్థితి ఉన్నది కాబట్టి పిఓ, కలెక్టర్ లు ఈ ప్రభుత్వము స్పందించి వెంటనే వారికి పట్టా పాసుబుక్కులు ఇవ్వాలని లేకపోతే దానికి అనుకూలమైన చెల్లుబాటు అయ్యే డాక్యుమెంట్ ఏదైనా ఇవ్వాలని ఏపీఓ గారితో మాట్లాడడం జరిగింది. లేకపోతే తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో సంబంధిత పోడు సాగు రైతులను సమీకరించి ఆందోళన పోరాట కార్యక్రమాలు చేపడతామని డిమాండ్ చేశారు.

పని ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం రక్షణ కవచం

- **చట్టంపై అందరికీ తప్పనిసరిగా అవగాహన కల్పించాలి**
- **మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు**
- **కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

ఏటూరు నాగారం మే 25 (పీపుల్స్ డైరీ) : పనిచేసే ప్రదేశాలలో మహిళలకు పోష్ చట్టం ఒక రక్షణ కవచంలా ఉంటుందని, పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ చట్టం--2013పై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మే 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలలో భాగంగా "మహిళల భద్రత -- రక్షణ" కార్యక్రమం సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళలు గౌరవంగా భయభ్రాంతులు లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలని, పోష్ చట్టం మహిళా ఉద్యోగులకు రక్షణ కవచంలా పనిచేస్తుందని వివరించారు. వేధింపులకు గురైన మహిళలు మౌనంగా ఉండకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని,ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. మహిళా ఉద్యోగుల భద్రతకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఎక్కడైనా ఉల్లంఘనలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. షీ-టీమ్స్, భరోసా కేంద్రాల సేవలను సైతం వినియోగి ంచుకోవాలని అన్నారు. అనంతరం పోష్ చట్టం, న్యూట్రిషన్ పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి. సంపత్ రావులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత , మున్సిపల్ చైర్‌పర్సన్ చంద్రకళ, ఆర్డీవో వెంకటేష్, డీఎస్పీ కిషోర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటీయూ నాయకుల వినతి

మేడ్చల్ మే 25 (పీపుల్స్ డైలీ):- మేడ్చల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటీయూ ఆధ్వర్యంలో మేడ్చల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుధాంశ్‌కు వినతిపత్రం సమర్పించిన సిఐటియు నాయకులు. ఈ సందర్భంగా సిఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ, గతంలో గ్రామపంచాయతీ, తరువాత మున్సిపాలిటీగా, ప్రస్తుతం జిహెచ్ఎంసిలో విలీనం అయినప్పటికీ కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కాకపోవడం బాధాకరమన్నారు. గ్రామపంచాయతీ వం-క్రర్లుగా ప్రారంభించి ప్రస్తుతం జిహెచ్ఎంసి కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గత ఆరు నెలలుగా కార్మికుల పీఎఫ్ డబ్బులు వారి ఖాతాల్లో జమ కాకపోవడం ఆందోళన కలిగించే విషయమన్నారు. మ-రోవైపు ప్రొఫెషనల్ టాక్స్ పేరిట రూ.535, టీడీఎస్ పేరిట రూ.400 జీతాల నుంచి కోత విధించడం వల్ల ఇప్పటికే తక్కువ వేతనాలతో జీవిస్తున్న కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ కోతలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికుల తరఫున పలు డిమాండ్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మేడ్చల్ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని కోరారు. జిహెచ్ఎంసి కార్మికులకు చెల్లిస్తున్న వేతనాలను మేడ్చల్ కార్మికులకు కూడా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మరణించిన కార్మికులకు రూ.25 లక్షల ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని, 60 ఏళ్లు పైబడిన కార్మికులను తొలగిస్తే వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడంతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. అదేవిధంగా ఆదివారాలు, పండుగ సెలవులు ఇవ్వాలని, ఎస్ఏఎఫ్ఏ లు, జవాన్లు, వర్క్ ఇన్స్పెక్టర్లకు ప్రమోషన్లు కల్పించాలని, డబుల్ బెడ్‌రూం మరియు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో కార్మికులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ హాజరు విధానంలో మార్పులు చేసి పని ప్రదేశాల వద్దనే ఒకేసారి హాజరు నమోదు చేసే విధానం అమలు చేయాలని సూచించారు. వినతిపత్రంపై స్పందించిన డిప్యూటీ కమిషనర్ సుధాంశ్, తమ పరిధిలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మిగిలిన అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటీయూ నాయకులు ఎన్. మల్లేష్, గణేష్, ఎం. మల్లేష్, రవి, లక్ష్మారెడ్డి, మధు, సంతోష్, రాజు, శ్రీకాంత్, రాము, ఎం. మహేష్, బిక్షపతి, శివ, లక్ష్మణ్, వెంకటయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాడబలిజ 26వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

ఏటూరు నాగారం మే 25 (పీపుల్స్ డైలీ) : సోమవారం ఏటూరునాగారం లో తెలంగాణ రాష్ట్ర వాడబలిజ సేవా సంఘం రాష్ట్ర ఉపా అధ్యక్షుడు గార ఆనంద్ ఆధ్వర్యంలో 26వ వాడబలిజ జెండ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా రామన్నగూడెం రోడ్ నుండి వై జంక్షన్ వరకు ర్యాలీ ద్వారా వచ్చి వై జంక్షన్ లొ జెండ ఆవిష్కరణ చేసి బిఆర్ పంక్షన్ హాల్ లొ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసుకొని రాష్ట్ర ఉపాఅధ్యక్షులు గార ఆనంద్ సభ అధ్యక్షులు గా వ్యవహరించి మాట్లాడుతూ ప్రభుత్వం మాకు ప్రభుత్వ పథకాలు మా కులశీ కు అందించాలని కోరుతూ ఈ యొక్క కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు డర్ర దామోదర్ రాష్ట్ర సలహాదారు మరియు రాష్ట్ర అధికార ప్రతినిధి తోట మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రభుత్వం నుండి గోదావరి సొసైటీ లు ఇందిరమ్మ ఇల్లు లు సబ్సిడీ లు గోదావరి ప్రాంతాల లో ఉన్న మా కులస్తుల కు గవర్నమెంట్ మా కులాలను గుర్తించాలి ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్రఉపాఅధ్యక్షు లు గగ్గురి రమణయ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లె భాస్కర్, రాష్ట్ర కోశాధికారి బోట రమణయ్య, సలహా దార్లు గార పోషాలు, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు బొల్లె ఆదినారాయణ, ములుగు జిల్లా అధ్యక్షుడు మహేశ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

అధ్యక్షుడు తోట ప్రశాంత్, మండల అధ్యక్షులు అంగాలా వీరన్న, నాగార్జున, రాంప్రసాద్, ఎర్రవుల ప్రేమ, బొల్లె సునీల్, గగ్గురి ఖాదర్, బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ కర్ల అరుణ, వఇ వైస్ ఎంపీపీ అల్లి కమల, సూరిబాబు వఇ ఉప సర్పంచ్ లు సూర్యం సతీష్, సొసైటీ డైరెక్టర్ లు కార్ల శ్రీను, మేకలబోయిన సాంబశివరావు, జిల్లా నాయకులు అధికార ప్రతినిధి కళల రాంబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ తోట ప్రశాంత్, సురేశ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అవినీతిపై ఎన్ని సార్లు పిర్యాదు చేయాలి?

- **డాక్టర్ కృష్ణ ప్రశద్, డాక్టర్ నవీన ఇతర డాక్టర్ ల నుండి 4.50 కోట్లు రికవరీ చేయాలి.**
- **2023 లో అప్పటి DM&HO డాక్టర్ లలితదేవి ఇచ్చిన రిపోర్టు పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు.**
- **ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కి ఏ ఐ ఎఫ్ బి అధ్వర్యలో ఫిర్యాదు.**

కరీంనగర్. మే 25పీపుల్స్ డైలీ : జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు అనంతరం ఏ ఎఫ్ బి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా జనరల్ హాస్పిటల్ 2023 అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ నవీన మరియు ఇతర డాక్టర్లపై వచ్చిన ఆరోపణలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, రూ.4.50 కోట్ల రూపాయల దుర్వినియోగంపై డబ్బులను రికవరీ చేయించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొని వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ అవినీతిపై మరోసారి విచారణ చేసిన డిఎం & హెచ్ఓ, ఇతర అధికారులు మరియు తెలంగాణ వైద్య విధాన పరిషత్ అధికారులు నిర్వహించిన తదుపరి విచారణలోని అంశాలను ఇప్పటి వరకు ప్రజలకు గానీ, ఫిర్యాదుదారునికి గానీ వెల్లడించకపోవడం అత్యంత ఆశ్చర్యకరమైన మరియు దురదృష్టకరమైన విషయం. కరీంనగర్ జిల్లా జనరల్ హాస్పిటల్లో 2021 నుంచి 2024 వరకు జరిగిన అవినీతి అక్రమాలపై అప్పటి ణవీఁనూ లలితదేవి ఎంక్వయిరీ రిపోర్టు ప్రకారం అప్పటి సూపరింటెండెంట్ కృష్ణప్రసాద్, ఇతర డాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 4.50కోట్లు కు ఎలాంటి బిల్లులు, రసీదులు మరియు ఓచర్సు లేవని అన్నీ ఆధారాలు ఉన్న ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జనరల్ హాస్పిటల్ ఐసీఐసీఐ, ఐవోబీ మరియు యూనియన్ బ్యాంకు యొక్క 2021 నుంచి 2024 వరకు సమగ్రంగా ఆడిట్ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 2021 నుంచి 2024 వరకు ఎంక్వైరీ ఆఫీసర్ ఇచ్చిన రిపోర్టులో హాస్పిటల్ యొక్క హెచ్ డి ఎస్ నిధులు, కాయకల్ప నిధులు, టీవీవీపీ, టీఎస్ఎంఎస్ఐడీసీ, హాస్పిటల్ నిర్వహణకు ఉపయోగించే వాహనాలకు డీజిల్, పెట్రోల్ అయిన ఖర్చులు దాదాపు 4.50 కోట్ల రూపాయలు, వీటికి ఎక్కడ కూడా ఓచర్స్, బిల్లులు, రశీదులు, ఎలాంటివి సబ్మిట్ చేయలేదని ఎంక్వైరీ ఆఫీసర్ రిపోర్టులో పేర్కొన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ కు అనేక రూపాలలో వచ్చే నిధులలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయని అన్నారు ప్రభుత్వ నిధుల దుర్వినియోగం మరియు అక్రమ వినియోగానికి బాధ్యులుగా తేలిన అధికారులందరిపై తక్షణమే శాఖాపరమైన మరియు క్రిమినల్ చర్యలు ప్రారంభించాలి; ఈ మోసంలో పాలుపడిన వ్యక్తుల నుండి అక్రమంగా కాజేసిన/ దుర్వినియోగం చేసిన సొమ్మును తిరిగి రాబట్టడానికి కఠిన చర్యలు తీసుకోవాలి;ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పాలుపడిన వ్యక్తులందరినీ గుర్తించేందుకు, ఈ మొత్తం కుంభకోణంపై నిష్పక్షపాత, పారదర్శక మరియు స్వతంత్ర విచారణ జరిగేలా చూడాలి ఇన్ని కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలు జరిగినా వాటిని రికవరీ చేయకుండా డాక్టర్లను బదిలీ చేయడం, ఇప్పటికీ కూడా టీవీవీపీకి సూపరింటెండెంట్గా అవినీతి పరుడైన కృష్ణ ప్రసాద్ కొనసాగడం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఆర్ ఎం గా డాక్టర్ నవీన కొనసాగడం చాలా బాధకరమైన విషయం అని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ జోక్యం చేసుకుని సూపరింటెండెంట్ కృష్ణ ప్రసాద్ను, డాక్టర్లు అజయ్ కుమార్, మహ్మద్ అలీం, రత్నమాల, శ్రీనివాస్, జ్యోతి, నవీనలను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

కొందరికి కాదు.. అర్హులైన అందరికీ చేయూత ఇవ్వాలి

బొంతు పల్లి సర్పంచ్ బావు సంపత్

వీణవంక మే 26(పీపుల్స్ డైలీ) : మండలంలోని బొంతుపల్లి సర్పంచ్ బావు సంపత్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సంఖ్యా పెంచాలి. చేయూతపెన్షన్ కొందరికి కాదు, అరుహులైన ప్రతీ ఒక్కరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే చదువు జితేందర్ రెడ్డి మాట్లాడుతూ 2026 జూన్ 2నుండి రాష్ట్రం లో రెండు లక్షల మందికి పెన్షన్, నియోజకవర్గంకు రెండు వేల మందికి ఇళ్ళు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం అర్భటం చేస్తుంది కానీ,రాష్ట్రం లో వివిధ రకాల పెన్షన్ కు అర్హత కలిగిన వారు ప్రభుత్వం ప్రకటన చేసిన దానికి మూడు రేట్లు అధికంగా ఉండే అవకాశం ఉందని అన్నారు. గతం లో ఇలాగే అర్బాటాపు ప్రకటనలు చేసి, ఇందిరా ఆత్మీయ భరోసా, రాజీవ్ యువవికాస పథకాలు ఆధిలోనే నిలిచి పోయాయని గుర్తు చేశారు. చివరిగా ఆగస్టు 2022లో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి దాదాపు పది లక్షల మందికి వివిధ రకాల పెన్షన్స్ ఏక కాలంలో మంజూరు చేయడం జరిగిందని,2022 ఆగస్టు నుండి ఇప్పటి వరకు ఏఒక్కరికి కొత్తగా పెన్షన్ మంజూరు కాలేదని చదువు జితేందర్ రెడ్డి అన్నారు. మూడున్నర ఏళ్ల తరువాత కేవలం రెండు లక్షల మందికి అంటే, 12500 పైగా గ్రామ పంచాయతీలు మున్సిపాలిటీలలో వార్డులు /డివిజన్లు దాదాపు 2900 వరకు ఉన్నాయని ఈలెక్కన ఒక్కొక గ్రామం, వార్డు, డివిజన్ లలో 10,నుంచి 12 మందికి మాత్రమే పెన్షన్ వచ్చే అవకాశం ఉందని, అర్హులైన వారిని గుర్తించడం కూడా స్థానిక అధికారులకు కత్తిమీద సామె అని జితేందర్ రెడ్డి అన్నారు. ప్రతీ నియోజకవర్గంకు 500 ఇండ్లు రిజర్వ్ చేసి, వివిధ దశలలో నిలిచి పోయిన ఇండ్లకు ఆర్థిక సహాయం చేయాలనే సానుకూల నిర్ణయం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ,ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడుతలో నియోజకవర్గంకు 3500 మంజూరి చేసి, రెండో విడుతలో 1500 తగ్గించడం పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు ప్రతీ నియోజకవర్గానికి గతంలో వలె 3500 ఇండ్లు మంజూరు చేయాలనీ బావు సంపత్, చదువు జితేందర్ రెడ్డి డిమాడ్ చేశారు.

గంగిశెట్టి మధురిమ ట్రస్ట్ ఆధ్వర్యంలో...

పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు గంగిశెట్టి మధురిమ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతులు అందజేత

ఏటూరు నాగారం మే 25 (పీపుల్స్ డైలీ) : 2025 – 26 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు గంగిశెట్టి మధురిమ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం బహుమతులను అందజేశారు. ఈ నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతిలో 2025–26 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోనే మూడవ స్థానంలో నిలిచిన కోరం కృష్ణ అనే విద్యార్థిని అదేవిధంగా రెండవ, మూడవ స్థానంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ గంగిశెట్టి జగదీష్ అందజేశారు. రాష్ట్రంలో మూడవ ర్యాంకు జిల్లాలో రమొదటి ర్యాంకు సాధించిన కోరం కృష్ణ అనే బాలికను ఘనంగా సన్మానించారు. అనంతరం ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో గణితము మరియు సైన్స్ లలో టాలెంట్ టెస్టులను నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందించడం, పదవ తరగతిలో మంచి మార్కులు సాధించిన మండల టాపర్స్ కు ప్రోత్సాగ బహుమతులు అందించడం, పదవ తరగతి విద్యార్థులకు పెద్ద మొత్తంలో పరీక్ష ప్యాడ్లు అందించడం, ఆర్ఫాన్ విద్యార్థులకు నోట్ బుక్స్ ఇవ్వడం అలాగే సమాజంలో అనేక సేవా కార్యక్రమాలు గత 15 సంవత్సరముల నుండి సొంత డబ్బులతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు సాంబశివ రావు ఎంఈఓ కొయ్యడం మల్లయ్య పీఈటి పద్మ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు నెలవుగా ప్రధాన జాతీయ రహదారి

ఏటూరు నాగారం మే 25 (పీపుల్స్ డైలీ) : మండల కేంద్రంలోని ప్రధాన జాతీయ రహదారి పై సేద తీరుతున్న పశువులు. మండలంలోని వైజంక్షన్ నుండి కొత్త బస్టాండ్ వరకు పశువులు రహదారి పై పడుకోవడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన ద్విచక్ర వాహనదారుల ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఐనప్పటికిని పశు యజమానులకు సరైన కౌన్సిలింగ్స్ ఇవ్వడంలో అధికారులు విఫలమౌతున్నారు. పోలీసు, పంచాయితీ శాఖ అధికారులు చర్యలు తీసుకుని ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

రేగొండ మే 25 పీపుల్స్ డైలీ...రేగొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యాన్ని తూకాలు వేసిన వెంటనే మిల్లులకు తరలించాలని రేగొండ ఎస్సై సుధాకర్ సూచించారు. సోమవారం గోరి కొత్తపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తేమ శాతం కలిగిన ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని,రవాణా పరంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కొనుగోలు దారులను ఆదేశించారు. ఏరోజుకారోజు కొనుగోళ్ల పరిస్థితిని పరిశీలించాలన్నారు. వర్షాలు ప్రారంభ నేపథ్యంలో రైతులు ఆరబెట్టిన, నాణ్యమైన ధాన్యాన్ని తెచ్చి ప్రభుత్వ మద్దతు ధరలు పొందాలని, దళారీలను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. త్వరితగతిన మిల్లులకు చేరవేయాల్సిందిగా సూచించారు అదేవిధంగా చిన్నకోడెపాక మిల్లును సందర్శించి నిర్వహణకు అమ్మాయిల సంఖ్య పెంచి లారీలు ట్రాక్టర్లు అన్లోడ్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు లారీలు ట్రాక్టర్ డ్రైవర్లు క్యూ పద్ధతి పాటించి రైతులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉండకుండా చూడాలని ధాన్యం అన్లోడ్ ప్రక్రియకు సహకరించాలని కోరారు.

రైతులను ఆదుకోవాలి

బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి

హుస్నాబాద్, మే 25, (పీపుల్స్ డైలీ) :ప్రభుత్వం కొనుగోళ్లు వేగవంతం లేక ధాన్యం మరియు మొక్క జొన్నలు అమ్ముకునే రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల ల్లో కాలం గడుపాలిసి వస్తుంది ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దాదాపు నెలన్నర రోజులు గడిచిపోయిశీది. కొనుగోలు కేంద్రాలల్లో ఇంకా దాదాపు ముప్పై శాతం ధాన్యం మొక్క జొన్నలు కొనుగోలు కేంద్రాల లోనే ఉన్నాయి వాతావరణ పరిస్థితి లో మార్పులు వస్తున్నాయి దాని వలన అకాల వర్షాల వలన రైతులు కష్టపడి పండించిన పంటలు నష్టపోతాయి కాబట్టి వెంటనే కొనుగోళ్ల ను వేగవంతం చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ ప్రభుత్వాన్ని కోరుతుంది ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున రెడ్డి,అయిలేని గాల్ రెడ్డి, పాలుగోన్నారు.

పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగాలి

- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్



కరీంనగర్ మే 25 పీపుల్స్ డైలీ :ఉమ్మడి కరీంనగర్ జిల్లా తెలంగాణ రాజ్యాధికార పార్టీ ముఖ్య నాయకులతో పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేసే అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రాజకీయ పరిస్థితుల్లో ప్రజలు ఒక నిజాయితీగల ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని ఆశిస్తున్నారని, ఆ ఆశలకు తెలంగాణ రాజ్యాధికార పార్టీనే సమాధానమని అభిప్రాయపడ్డారు. పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న గారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి కార్యకర్త బాధ్యత అని ఈ సందర్భంగా మాధం రజిని కుమార్ యాదవ్ గారు పేర్కొన్నారు.పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి బస్తీ వరకు తీసుకెళ్లాలని, ముఖ్యంగా యువత, బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు మరియు అణగారిన వర్గాలను పెద్ద ఎత్తున పార్టీతో అనుసంధానం చేయాలని సూచించారు. తెలంగాణలో ఎన్నో దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపగల శక్తి ప్రజల నుంచే పుట్టిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ మాత్రమేనని ఆయన అన్నారు. సభలో పాల్గొన్న ముఖ్య నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి రోజురోజుకు విశేష ఆదరణ పెరుగుతోందని, ముఖ్యంగా యువత మరియు సామాన్య ప్రజల్లో పార్టీపై విశ్వాసం బలపడుతోందని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసేందుకు మండల, గ్రామ కమిటీలను త్వరితగతిన పూర్తి చేసి ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించారు. అదేవిధంగా సోషల్ మీడియా ద్వారా పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతి కార్యకర్త ప్రజల మధ్య ఉండి వారి సమస్యలపై స్పందించడం, గ్రామ స్థాయిలో ప్రజా సమావేశాలు, ఇంటింటి ప్రచార కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలపై కూడా చర్చించారు. ఈ సమావేశం పార్టీ భవిష్యత్ కార్యాచరణకు దిశానిర్దేశం చేసే విధంగా ఎంతో ఉత్సాహభరితంగా జరిగింది. పార్టీని ప్రజల ఉద్యమంగా తీర్చిదిద్దేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త అంకితభావంతో పని చేయాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాధం రజిని కుమార్ యాదవ్ గారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా లోని ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

గోవుల అక్రమ రవాణాను అరికట్టడమే ధ్యేయంగా నిఘా తీవ్రం

వంగర చెక్ పోస్ట్ వద్ద పోలీస్ తనిఖీలు

భీమదేవరపల్లి మే 25:(పీపుల్స్ డైలీ) :వరంగల్ కమిషనరేట్ పరిధిలో గోవుల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టడమే ధ్యేయంగా పోలీసులు నిఘా తీవ్రం చేశారు.వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం వంగర పోలీస్ స్టేషన్ పరిధిలోని చెక్‌పోస్టు వద్ద పోలీసులు ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు.ఎల్కతుర్తి సీఐ పులి రమేష్,వంగర ఎస్ఐ దివ్యలిల పర్యవేక్షణలో పోలీసు సిబ్బంది చెక్‌పోస్ట్ మీదుగా వెళ్తున్న లారీలు, కంటైనర్లు, ఇతర భారీ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వాహనాల పత్రాలను పరిశీలించి, గమ్యస్థానాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీఐ పులి రమేష్ మాట్లాడుతూ చట్టాన్ని ఉల్లంఘించి గోవులను లేదా ఇతర పశువులను అక్రమంగా రవాణా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.అక్రమ రవాణాకు పాల్పడే వారిపై చట్టప రమైన కేసులు నమోదు చేస్తామన్నారు. పశువుల అక్రమ రవాణా, తరలింపుపై ప్రజలకు ఎలాంటి సమాచారం ఉన్నా తక్షణమే పోలీసులకు అందించాలని కోరారు.అక్రమ రవాణాకు సహకరించే వాహనాలను చట్టప్రకారం సీజ్ చేయడం జరుగుతుందని, డ్రైవర్లు, క్లీనర్లు,యజమానులపై కూడా చట్టపరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గోవుల తరలింపును అడ్డుకునేందుకు చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ నిరంతర నిఘా, ఆకస్మిక తనిఖీలు కొనసాగు తాయని పోలీసులు స్పష్టం చేశారు.

వారం పాటు జరిగే మహిళా వారోత్సవాలను జయప్రదం చేయాలి

- మహిళా లోకానికి మహిళా వారోత్సవ శుభాకాంక్షలు
- ఇది మహిళా శక్తి మహోత్సవం... ఇది ఆడబిడ్డల ఆత్మగౌరవ యాత్ర- మంత్రి సీతక్క

ఏటూరు నాగారం మే 25 (పీపుల్స్ డైలీ) : తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకలైన అక్కచెల్లెమ్మలకు మహిళా వారోత్సవ శుభాకాంక్షలు తెలిపారు మంత్రి సీతక్క. ఈ నెల 25 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న మహిళా వారోత్సవాలు కేవలం ఒక కార్యక్రమం కాదనీ మహిళా శక్తి సామర్థ్యాలను, ఆత్మవిశ్వాసాన్ని, సాధికారతను ప్రపంచానికి చాటి చెప్పే మహోత్సవమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజా భవన్ నుంచి వీడియో సందేశం విడుదల చేశారు. ఒకప్పుడు చిన్న పొదుపులతో ప్రారంభమైన స్వయం సహాయక సంఘాలు. నేడు తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచాయని మంత్రి అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా... పారిశ్రామికవేత్తలుగా, ఉపాధి సృష్టికర్తలుగా తీర్చిదిద్దుతోందని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందిస్తూ ఆర్థిక స్వావలంబనకు బలమైన తోడ్పాటు అందిస్తున్నామని తెలిపారు. క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు, సెంట్రింగ్ యూనిట్లు, ఇటుకల తయారీ కేంద్రాలు వంటి రంగాల్లో మహిళలు ముందంజలో నిలుస్తున్నారని చెప్పారు. మహిళలు ఆదాయ వనరులు సృష్టించుకునే దిశగా ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనిస్తోందన్నారు.చెట్ల కింద సమావేశాలు నిర్వహించే పరిస్థితి నుంచి... గ్రామీణ మహిళలకు గౌరవప్రదమైన వేదికలు కల్పించే దిశగా 8 వేల మహిళా భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయడం గర్వకారణమని మంత్రి పేర్కొన్నారు. ఇది మహిళల పట్ల ఇందిరమ్మ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. రెండున్నరేళ్ల ప్రజా పాలన ప్రయాణాన్ని అవలోకనం చేసుకునే సందర్భంగా మహిళా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కోటి చీరల పంపిణీతో పాటు రూ.60 వేల కోట్లకు పైగా బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక బలం అందిస్తున్నామని వెల్లడించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరుల్ని చేయాలి అన్న ముఖ్యమంత్రి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తున్న మహిళా సంఘాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆడబిడ్డ బలపడితే కుటుంబం బలపడుతుందని... కుటుంబం బలపడితే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి పేర్కొన్నారు. ఈ మహిళా వారోత్సవాలను ప్రతి మహిళ తన ఆత్మగౌరవ పండుగగా భావించి పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘ సభ్యులతో ముఖాముఖి నిర్వహించనున్నారని రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాల సభ్యులంతా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క కోరారు.

సమ్మర్ క్యాంప్ సక్సెస్ ఫుల్ గా పూర్తిచేసిన స్కూల్ యాజమాన్యం

కమలాపూర్ మే 25 (పీపుల్స్ డైలీ) : పిఎం శ్రీ టి జి మోడల్ స్కూల్ కమలాపూర్ వేదికగా ఈ నెల 11 నుంచి 25 వరకు సమ్మర్ స్పెషల్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో పాటు ప్రైవేట్ స్కూలు విద్యార్థులు కూడా ఎండ వేడిమిని సైతం లెక్కచేయకుండా ఉత్సాహంతో పాల్గొన్నారు. 15 రోజులపాటు నిర్వహించిన ఈ క్యాంపులో రజనీకాంత్, రిషి చిత్రకళా అకాడమీ హనుమకొండ డ్రాయింగ్ లో, శరత్ ఎం జె పి డాన్స్ టీచర్ క్లాసికల్ డాన్స్ లో, ఏం త్రివేణి ఎం జె పి శ్రీ సంగీతంలో అయితే శ్రీనివాస్ ఎస్ జి టి ధర్మసాగర్ లైఫ్ స్కిల్స్ పైన మోటివేషన్ క్లాసులు, రోబో కులం ఇనిస్ట్యూట్, డ్రోన్ పని చేసే విధానం గురించి, జే అపర్ణ అప్పారెల్ టి జి ఎం ఎస్ కమలాపూర్ ఆర్ట్ క్రాఫ్ట్ అండ్ క్లాత్ డిజైనింగ్ గురించి, రాజు పిడి టిజిఎంఎస్ కమలాపూర్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ పైన మరియు రాజు యోగా టీచర్ యోగాసనాలు సూర్య నమస్కారాలు మొదలగు అంశాల పైన వారు విలువైన సలహాలు శిక్షణలు విద్యార్థులకు అందించారు. విద్యార్థులందరూ నూత నత్సాహంతో ప్రతిరోజు పై అంశాలను అల్లదకరమైన వాతావరణంలో చాలా చక్కగా నేర్చుకున్నారు. వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు చివరి రోజు విద్యార్థులు పాడిన పాటలు జయ జయ తెలంగాణ నృత్యాభినయం ముగింపు వేడుకలకు మరింత వన్నెతెచ్చాయి. ఈ కార్యక్రమంలో కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ ఉపసర్పంచ్ శ్రీను వార్డు మెంబర్స్ మల్లారెడ్డి, తిరుపతి, కీర్తన ,రామ్ శెట్టి రాజయ్య ,జెఎసి సంపత్, ఇన్చార్జి ప్రిన్సిపల్ టి వీరేశం, తిరుపతి, రాజు పిడి, అపర్ణ, మహేందర్ ,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని విజయ వంతం చేశారు.

పోషకాహారం ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు

మేడ్చల్ మే 25 (పీపుల్స్ డైలీ):- జిల్లా స్థాయిలో ప్రజా ప్రభుత్వం కార్యక్రమం మరియు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మూడు చింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట మున్సిపా లిటీల పరిధిలో కిషోర్ బాలబాలికలకు పోషకా హారం, ఆరోగ్య పరిరక్షణ మరియు వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమా న్ని ఉద్దేశించి మున్సిపల్ చైర్మన్లు మాట్లాడుతూ, కిషోర్ బాలబాలికలకు పోషక విలువలతో కూడిన ఆహారం అవసరంపై అవగాహన కల్పించేందుకు కుకింగ్ కాంపిటీషన్‌లు, మెడికల్ హెల్త్ చెకప్ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిల్లలు, తల్లిదండ్రులకు సమతుల ఆహారం యొక్క ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన జీవనశైలి మరియు పోషకాహారం అవసరంపై వివరించారు. కుకింగ్ కాంపిటీషన్‌లలో తండ్రులు సైతం ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యకరమైన వంటకాల తయారీలో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ అవగాహన సదస్సును ఉద్దేశించి జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ, అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు మరియు బాలబాలికలకు ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం తదితర పౌష్టికాహార పదార్థాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ వైద్య సిబ్బంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సూచనలు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా పోషకా హారం, ఆరోగ్య పరిరక్షణ మరియు పరిశుభ్రతపై సమాజంలో మంచి అవగాహన ఏర్పడిందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మెడికల్ ఆఫీసర్లు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తల్లులు, పిల్లలు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కుల నిర్మూలన చట్టం చేయాలి

సమాజిక కార్యకర్త కోరిమి వెంకటస్వామి.

శంకరపట్నం మే: 25 పీపుల్స్ డైలీ: పార్లమెంటులో కులాన్ని రద్దు చేసే విధంగా చట్టాన్ని తీసుకురావాలని భారత ప్రధాని నరేంద్ర మోదీని సామాజిక కార్యకర్త కొరిమి వెంకటస్వామి కోరారు.కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుల నిర్మూలన చట్టం చేయడంవల్ల మన దేశంలో దాడులు దౌర్జన్యాలు. హత్యలు, అత్యాచారాలు తగ్గే అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశ వైపు ఆలోచన చేయాలని ఆయన అభ్యర్థించారు. ఎస్సీ , ఎస్టీ , బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. దేశంలోని అయోధ్య, తిరుపతి షెబరి షిరిడీ తదితర ప్రధాన ఆలయాలలో పూజారులుగా నియమించుకునే అవకాశం ఉంటుందన్నారు బడి ఆసుపత్రి ప్రభుత్వ కార్యకలాపాలలో ఏ విధంగానైతే నడుస్తున్నాయో అదేవిధంగా ఆలయాలలో కూడా ఎస్సీ ఎస్టీ బీసీలను నియమించుకునే అవకాశం కలుగుతుందన్నారు. పెళ్ళిళ్ళు గృహప్రవేశాలు ప్రభుత్వ కార్యాలయాల శంకుస్థాపన ప్రారంభోత్సవాలు తదితర కార్యక్రమాలకు వీలు కలుగుతుందన్నారు కుల నిర్మూలన జరగడానికి ఎన్నో అవకాశాలు కలుగుతాయని వెంకటస్వామి అన్నారు. సమాజంలో ఆర్థిక సామాజిక రాజకీయ రంగాలలో సామాజిక న్యాయం జరిగే అవకాశం ఉంటుందని బాబా సాహెబ్ అంబేద్కర్ పూలే కలలుగన్న సమాజం ఏర్పడే అవకాశం ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కనీస వసతులు కరువు

భీమదేవరపల్లి మే 25 (పీపుల్స్ డైలీ) :హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు కనీస మౌలిక వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఎండ తీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో పనుల వద్ద నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయలేదు. తాగేందుకు మంచినీటి సౌకర్యం కల్పించలేదు. అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడే ఫస్ట్ ఎయిడ్ కిట్ కూడా అందుబాటులో లేకపోవడంతో కూలీలు అవస్థలు పడుతున్నారు.అధికారులు కేవలం ఫోటోలు దిగడానికే పరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను పట్టించుకోవడం లేదని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కనీస వసతులు కల్పించి కూలీల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం పై సూచనలు

హుజురాబాద్ టౌన్ మే 25 (పీపుల్స్ డైలీ) : హుజురాబాద్ పట్టణంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా మహిళ వారోత్సవాలను పురస్కరించుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని-మనోజ్ రావు గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారం గురించి రక్తహీనత గురించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో సుపరిండెంట్ నారాయణ రెడ్డి , డిప్యూటీ ణవీ ఉ నూ శ్రావణ్, జణూూ సుగుణ, అంగన్వాడి సూపర్వైజర్ రమ్య ,డాక్టర్లు ,వైద్య సిబ్బంది ,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

చీరలు పంపిణీ

హుజురాబాద్ టౌన్ మే 25 (పీపుల్స్ డైలీ) :హుజురాబాద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని- మనోజ్ రావు ఆధ్వర్యంలో మహిళా వారోత్సవాల సందర్భంగా చీరల పంపిణీ, సంఘాల ఏర్పాటు, ఇందిరా మహిళా శక్తి లోన్ మేళా, ఉద్యమి రిజిస్ట్రేషన్,ూవీఖీవీజు,ూూఖీయూఖీ జనరల్ బాడీ మీటింగ్ జరిగినది కౌన్సిలర్స్ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో కమిషనర్ కిషన్ , వైస్ చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్స్, కో ఆప్షన్ మెంబర్స్, మెప్మా డిపార్ట్మెంట్, మహిళా సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

ప్రజా సేవలను వేగవంతం చేయాలి

మేడ్చల్ కీసర మే 25(పీపుల్స్ డైలీ) :- కీసర సర్కిల్ కార్యాలయంలో వివిధ ప్రజా సేవలకు సంబంధించిన అంశాలపై ఏఎంసిలు, టాక్స్ ఇన్స్పెక్టర్లు, వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత అధ్యక్షత వహించారు. సమావేశంలో ప్రజలకు సంబంధించిన పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ఉత్తర్వులు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న జనన, మరణ ధృవపత్రాల జారీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఇంటి నెంబర్ల జారీ, పేరు మార్పిడి, ఆస్తి మార్పిడి వంటి దరఖాస్తులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొత్త మరియు రెన్యువల్ ట్రేడ్ లైసెన్సులను వెంటనే జారీ చేయాలని, ప్రజలకు సేవలు అందించడంలో ఆలస్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జవఅంబం 2027 జనగణన సర్వేను పూర్తి పారదర్శకతతో నిర్వహించాలని, ప్రజలు కూడా సెన్సస్ ఎన్యూమరేటర్లకు సహకరించాలని డిప్యూటీ కమిషనర్ ఎన్. వసంత కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పలువురు పాల్గొన్నారు

నీరాజానాల వెలుగులో త్రివేణి

(మొదటి పేజీ తరువాయి)

5వ రోజు త్రివేణి సంగమం భక్తుల రాకతో కిక్కిరిసిపోతోంది. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమంలో భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు చేరుకుంటున్నారు. అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానమాచరించిన భక్తులు పుణీతులై నీరాజానాలు అర్పిస్తున్నారు. 5వ రోజు కూడా భక్తుల తాకిడీ తీవ్రంగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలందించే విధుల్లో నిమగ్నం అయింది. త్రివేణి సంగమంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది లోపలకు వెళ్లకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను, బోట్లు అందుబాటులో ఉంచిన అధికారులు భక్తులు ప్రమాదాలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

5వ రోజు...

పుష్కర నదికి మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతననుసరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురణాలు చెప్తున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొందించేందుకు భక్తులు కూడా చొరవ తీసుకోవాలన్న సంకల్పంతోనే హైందవ ఆచారాలు పాటించాల్సి ఉంటుంది. ప్రాకృత్య ధర్మానికి మించింది మరోటి లేదన్నది చేతల్లో చూపించేందుకే పూర్వీకులు ఈ సాంప్రాదాయాలను కొనసాగించే వారు. పుష్కర నది తీరంలో దానం చేయాలని పురణాలు వివరించాయి. సోమవారం శివునికి ఇష్టమైన రోజు కావడంతో పుష్కర సరస్వతి ఒడిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు దానాలు చేయడం మంచిదని చెప్తున్నాయి. 5వ రోజైన సోమవారం తెలంగాణ, ఏపీ, చత్తీస్ గడ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి పెద్ద సంఖ్యలో పుష్కర స్నానం ఆచరించేందుకు భక్తులు కాళేశ్వరం చేరుకుంటున్నారు.

రంగలీల మైదానం వాకర్స్ ఫ్రెండ్స్ టూర్ క్లబ్ వార్షికోత్సవం

వరంగల్ మే 25 (పీపుల్స్‌డైరీ) : వరంగల్ నగరంలో గల ఉర్సు రంగలీల మైదానం వాకర్స్ ఫ్రెండ్స్ టూర్ క్లబ్ వార్షికోత్సవం కరీమాబాదులోని శ్రీ నాగార్జున పరపతి సంఘం భవనంలో జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా 15 మంది డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. మేడిది మధుసూదన్, కోదాటి శ్యామ్, బజ్జురి వాస్, హనుమండ్ల శ్రీనివాస్, కాలువ అంజయ్య, గడ్డం రమేష్, నరిగే శ్రీనివాస్ గోదాసి మల్లికార్జున్ కోరే నాగరాజ్ బైరి హరినాథ్ పార్వతీ కృష్ణంరాజు వాసూరి శ్రీనివాస్ ఆకుతోట రాజు సిరంగి రాజకుమార్ కోశాధికారిగా గై గోపాల్ ఎన్నుకోవడం జరిగినది

బొద్దున వెంకటేశ్వర్లుకు జాతీయ అధ్యక్ష పదవి

ఏఐజీడీఎస్‌యూ జాతీయ మహాసభల్లో ఏకగ్రీవంగా ఘన ఎన్నిక

పీపుల్స్‌డైరీ–హనుమకొండ : తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి పోస్టల్ డివిజన్‌లో జరిగిన అఖిలభారతం గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం (ఏఐజీడీఎస్‌యూ) జాతీయ మహాసభల్లో హనుమకొండ జిల్లాలోని అయినవోలు మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన బొద్దున వెంకటేశ్వర్లు రెండవసారి జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 23 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించిన మహాసభల్లో జీడీఎస్ ఉద్యోగుల సమస్యలు, హక్కుల సాధనపై కీలక చర్చలు జరిగాయి. జాతీయ ప్రధాన కార్యదర్శిగా సి.కె. సుబ్రమణి (తమిళనాడు), కోశాధికారిగా నారాయణ చౌదరి (ఛత్తీస్‌గఢ్) ఎన్నికయ్యారు. సమావేశంలో జీడీఎస్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, 8వ పే కమిషన్ అమలు చేయాలని, పెన్షన్, మెడికల్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే జాతీయ కమిటీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్. మహాదేవయ్యను విధుల్లోకి తిరిగి తీసుకోవాలని మహాసభల్లో ఏకగ్రీవ తీర్మానం చేశారు. బొద్దున వెంకటేశ్వర్లుకు జాతీయ అధ్యక్ష పదవి దక్కడంపై తెలంగాణ జీడీఎస్ ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ వ్యాప్తంగా 37 లక్షల గృహ ఎల్‌పీజీ సిలిండర్లు..!

పీపుల్స్‌డైరీ–హైదరాబాద్ : తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు జోరుగా కొనసాగుతున్న ప్రస్తుత సమయంలో ఇంధన డిమాండ్ పెరిగినప్పటికీ నిరంతర సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వ రంగ చమురు సంస్థలు..రాష్ట్రవ్యాప్తంగా అంతరాయం లేకుండా పెట్రోల్ (ఎంఎస్), డీజిల్ (హెచ్ఎస్‌డీ), ఎల్‌పీజీ అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లు.. తమ కార్యకలాపాలు, రవాణా ఏర్పాట్లను రాత్రింబవళ్లు సమన్వయం చేసుకుంటున్నాయని పెట్రోలియం– సహజ వాయువుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

వివిధ రంగాల్లో ఇంధన డిమాండ్ ఒక్కసారిగా పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థ ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా సాగుతోందని తెలిపింది. ముఖ్యంగా 2026 మే నెలలో తెలంగాణలో పంట కోత, వ్యవసాయ పనులు ఊపందుకోవటంతో పాటు భారీ ఎత్తున ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది. దీనివల్ల ఇటీవల కాలంలో చమురు ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ధరలు తక్కువ ఉండటంతో ప్రైవేట్ బంకుల వినియోగదారులు సైతం ప్రభుత్వ రంగ పెట్రోల్ బంకుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ రంగ విక్రయ కేంద్రాల్లో ధరల ప్రయోజనం ఉండటంతో సంస్థాగత, వాణిజ్య వినియోగదారులు సైతం వీటి నుంచే ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు.

ఇదిలా ఉంటే 2026 మే నెలలో తెలంగాణలో ఇంధన విక్రయాలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. సాధారణ వృద్ధి రేటు కంటే చాలా ఎక్కువగా.. డీజిల్ (రిటైల్) విక్రయాలు 12.6 శాతం, పెట్రోల్ (రిటైల్) విక్రయాలు 9 శాతం పెరిగాయి. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) పెట్రోల్ బంకుల్లో జరిగిన డీజిల్ అమ్మకాలు 25 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయగా.. 12 జిల్లాల్లో 15 నుంచి 25 శాతం మధ్య వృద్ధి నమోదైంది. మే నెలలో చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) తెలంగాణవ్యాప్తంగా 37 లక్షలకు పైగా గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్లను సరఫరా చేసినట్లు నివేదికలు చెబుతున్నాయి.

చమురు నిల్వలపై సమీక్ష:

పెరిగిన డిమాండ్‌ను సమర్థవంతంగా అధిగమించడానికి ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు నిరంతరం నిల్వల స్థితిగతులను సమీక్షిస్తున్నాయి. దీనితో పాటు రవాణా, పంపిణీ ప్రణాళికలను అవి నిశితంగా సమన్వయం చేసుకుంటున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ తగినంత అందుబాటులో ఉన్నాయని వినియోగదారులకు భరోసా ఇస్తున్న చమురు పరిశ్రమ.. కేంద్ర పెట్రోలియం శాఖ, రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ నిరంతర సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేసింది.

ఇంధన లభ్యతకు సంబంధించిన కచ్చితమైన తాజా సమాచారం కోసం వినియోగదారులు కేవలం అధీకృత సంస్థలు, చమురు మార్కెటింగ్ సంస్థలు (ఓఎంసీ) ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలని సూచిస్తోంది.

ప్రైవేటుకు ధీటుగా..

జే.కృష్ణమాచారి,సీనియర్ రిపోర్టర్

'డబ్బున్న వారికే నాణ్యమైన విద్య' అనే అపోహను తొలగిస్తూ, సామాన్యుడి బిడ్డకు కూడా. అత్యుత్తమ భవిష్యత్తును అందించేందుకు ప్రభు త్వం తెలంగాణ ప్రభుత్వ పబ్లిక్ పాఠశాలలను ప్రవేశపెడుతుంది. ఈ పాఠశాలల ఏర్పాటుతో ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ లో విద్యాబోదన కొనసాగనుంది. ఈ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇంగ్లీష్ లో విద్యాబోదన చేస్తారు. సుమారు 800మంది వరకు విద్యార్థులు ఈ పాఠశాలల్లో చదువుకోవచ్చు. విద్యార్థులకు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారం ఏర్పాటు చేసి స్టడీ అవర్ కూడా నిర్వహిస్తారు. దీం తో పాటు దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థు లకు వాహనం ఏర్పాటు చేసి దానిలో పాఠశాలకు తీసుకురావడం జరుగుతుంది.

ఐదునియోజకవర్గాల వారీగా పాఠశాలు..

ఖమ్మం జిల్లా పరిధిలోని ఐదు నియోజకవర్గల్లో తెలంగాణ పబ్లిక్ పాఠశాలలను ఏర్పాటు చేస్తు న్నారు. ఖమ్మం నియోజకవర్గంలో నయబజార్లో పాఠశాలను ఏర్పాటు చేయగా.. వైరా ని॥ ఏన్కూరు, సత్తుపల్లి ని॥ పెనుబల్లిలో, పాలేరు ని॥ కూసుమంచి లో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క నియోజకవర్గంలో ఏకంగా 9 తెలంగాణ పబ్లిక్ పాఠశాలలను ఏర్పాటు చేస్తు న్నారు. ఈ స్కూల్స్ పరిధిలోని 2 కిలోమీటర్ల మేర ఉన్న పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్లో వీలినం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఈ పాఠశాలల్లోనే విద్యా బ్యాసం పూర్తి చేస్తారు. ఇక్కడే అల్పాహారంతో పాటు స్టడీ అవర్ కూడా పెట్టడంతో విద్యార్థులు ఆ రోజు తరగతిలో చెప్పిన చదువును, హోంవర్లు అక్కడే పూర్తి చేసుకుంటారు.

పాఠశాలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు..

వైరా నియోజవర్గ పరిధిలో.. ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయనుండగా.. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, ఆడిషనల్ కలెక్టర్ శ్రీజ పాఠశాలను పరిశీలించారు. ఏన్కూరులో ఏర్పాటు చేయనున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్లో.. ఏన్కూరు, జన్నారం జెడ్పీ పాఠశాలలు, సమీపం లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను ఈ స్కూల్నందు విలీనం చేస్తారు. వచ్చే విద్యా సంవ త్సరం నుంచి పాఠశాలకు కావాల్సిన మౌళిక వస తులు, అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టను న్నారు. కాగా ఇప్పటికే పాఠశాలలో తరగతి గదులు ఖాళీగా ఉన్నాయని, ఇంకొన్ని గదులు అవసరమవు తాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు

విద్యార్థులకు వరం..

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం విద్యార్థులకు వరం. ఇకపై పాఠ శాలలో ఒకటి నుంచి ఇంటర్ వరకు ఒకే పాఠశాల లో చదువుకోవచ్చు. ఇక్కడే అల్పాహారం, స్టడీ అవర్స్ నిర్వహించడంతో పాటు దూర ప్రాంతాల వారికి వాహనాల సౌకర్యం ఉంటుంది.

పి.నాగిరెడ్డి, ఎంఈఓ, ఏన్కూరు

ముగిసిన సప్లమెంటరీ ప్రయోగ పరీక్షలు

26న ఆంగ్లం ప్రాక్టికల్స్, 29న పర్యావరణ పరీక్షలు - డీఐఈఓ శ్రీధర్ సుమన్

మట్టెవాడ, మే 25 (పీపుల్స్ డైరీ) : వరంగల్ జిల్లాలో ఈ నెల 22వ తేదీ నుండి ప్రారంభమైన ఇంటర్ సప్లమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు ముగిసినట్లు జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాధికారి డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ తెలిపారు. సోమవారం రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించబడుతున్న జనరల్, ఒకేషనల్ ప్రయోగ పరీక్షలను పర్యవేక్షించారు. జిల్లాలో మార్చి లో నిర్వహించబడిన పరీక్షల్లో అనుత్తీర్ణులకు ఒక్కచోట ప్రయోగ పరీక్షలు నిర్వహించారని తెలిపారు. ఇంటర్ బోర్డు ఆదేశాల ప్రకారం 26వ తేదీన ఇంగ్లీష్ ప్రాక్టికల్స్ నిర్వహించ బడుతాయని, ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించనున్నారు. ఈనెల 29న పర్యావరణ పరీక్ష ఉంటుందని, విద్యార్థులు తాము చదివిన కళాశాలల్లోనే ఈ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. గతంలో గైర్హాజరైన, అనుత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిఐఈఓ సూచించారు.

ప్రజా వినతులను తక్షణమే పరిష్కరించాలి!

అదనపు కమిషనర్ చంద్రశేఖర్

మట్టెవాడ, మే 25 (పీపుల్స్ డైరీ) : ప్రజా వినతులను (ఫిర్యాదులను) తక్షణమే పరిష్కరించాలని అదనపు కమిషనర్ చంద్రశేఖర్ అధికారులకు సూచించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో నిర్వహించిన ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని అదనపు కమిషనర్ తో పాటు ఆయా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందచేసిన దరఖాస్తులను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాలకు చెందిన అధికారులకు అందచేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇలా ఉన్నాయి . టౌన్ ప్లానింగ్ 48, ఇంజనీరింగ్ 32, రెవిన్యూ 09, హెల్త్ అండ్ శానిటేషన్ 10, నీటి సరఫరా 04 మొత్తం కలిపి 103 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ శంకర్ లింగం, వెటర్నరీ వైద్యులు డాక్టర్ గోపాల్ రావు, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, పన్నుల అధికారి రామకృష్ణ, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, హెచ్ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో అధికారుల అక్రమ వసూళ్లు

జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ

చిట్యాల, మే 25 (పీపుల్స్ డైరీ) : టేకుమట్ల మండలంలోని ఐకెపి సెంటర్స్ లో సెంటర్ ఇంచార్జిలు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ హవా చేస్తున్నారని వరి మక్కల కొనుగోలు కేంద్రాల్లో పైసలు ఇస్తేనే రైతుల దాన్యాన్ని లోడ్ చేస్తున్నారని పైసలు ఇవ్వకుంటే రైతుల దాన్యాన్ని లోడ్ చేయకుండా వారి పట్ల దురుసుగా ప్రవర్తిస్తూ మార్కెటింగ్ శాఖ అధికారులకు కూడా వాటా ఇస్తున్నామని బెదిరిస్తున్నారని సెంటర్ ఇంచార్జిలు మార్కెటింగ్ అధికారుల పేరు చెప్పి మరీ రైతుల దగ్గర అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ టీఎస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు ఎలుకటి రాజయ్య మాదిగ ఆరోపించారు. సోమవారం ఆయన ఐకెపి సెంటర్స్ ను సందర్శించిన అనంతరం మాట్లాడుతూ ఐకెపి సెంటర్ ఇన్చార్జిల ఆదేశాలతో అయోమయ పరిస్థితుల్లో రైతులు పైసలు ఇస్తున్నారని ఇంత తతంగం జరుగుతున్న సంబంధిత మార్కెటింగ్ అధికారులు నిమ్మకు నీరేత్తి నట్లు వ్యవహరిస్తున్నారని అక్రమ వసూళ్లలో అధికారుల వాటా ఎంత? అని ప్రశ్నించారు. వర్షాకాలం దగ్గరికి వచ్చిన ధాన్యం కొనుగోలు చేయకపోవడం మూలంగా రైతులు అనేక అవస్థలుపడుతున్నారని ఇకనైనా స్థానిక శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి ఈ అక్రమ వసూళ్లపై విచారణ జరిపించి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చిలుక కుమార్ గజ్జి రాజయ్య దాసారపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలి : మారెపల్లి మల్లేష్

చిట్యాల, మే 25 (పీపుల్స్ డైరీ) : భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సిపిఐ ఎంఎల్ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేష్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా అగ్ని ప్రమాదంలో పంట నష్టపోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం అందే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలని వ్యవసాయ అధికారులు సమగ్రంగా సర్వే నిర్వహించి అరటి తోట మిరప మక్కలు కాలిపోయిన రైతులకు ప్రభుత్వ అధికారులు అండగా నిలిచి సమగ్రమైన సర్వే నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేయాలన్నారు. అగ్ని ప్రమాదంలో చనిపోయిన రేగొండ మండలం రేపాకపల్లి రైతు దంపతులకు 50 లక్షల రూపాయలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు ప్రభుత్వం చర్యలు తీసుకొని నష్టపోయిన రైతులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు బంధు క్రాంతి సుజాత ఆత్కూరి శ్రీకాంత్ స్వాతి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మారపెల్లి మల్లేష్

"రిటైర్ అయ్యాం.. హక్కులు మాత్రం రావట్లేదు"

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల ఆవేదన...
బకాయిల కోసం బస్సు డిపో ఎదుట బైఠాయింపు
ఆర్పీఎస్-2017 అరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్

భూపాలపల్లి, మే 25 (పీపుల్స్ డైరీ) : జీవితాంతం ఆర్టీసీ అభివృద్ధికి సేవలందించిన రిటైర్డ్ ఉద్యోగులు ఇప్పుడు తమ హక్కుల కోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడిందని రిటైర్డ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆర్ పీ ఎస్-2017 అరియర్స్, గ్రాట్యుటీ, లీవ్ ఎన్కాష్‌మెంట్, పీఎఫ్ పెన్షన్ సమస్య లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమ వారం భూపాలపల్లి డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017 ఏప్రిల్ నుంచి రిటైర్ అయిన ఉద్యోగులకు ఆర్ పీ ఎస్ -2017 ప్రకారం బకాయిలు చెల్లిస్తామని అధికారికంగా సర్కులర్ జారీ చేసినప్పటికీ ఇప్పటివరకు ఒక్క రూపా యి కూడా అందలేదని మండిపడ్డారు. ఉద్యోగంలో జీవితమంతా కష్టపడి పనిచేసి రిటైర్ అయిన తర్వాత తమకు రావాల్సి న డబ్బుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని వాపోయారు. రిటైర్మెంట్ తర్వాత కుటుంబ అవసరాలు, వైద్య ఖర్చులు, పిల్లల బాధ్యతలు పెరిగినా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం స్పందించడం లేదని అన్నారు. బకాయిల కోసం ఎదురుచూస్తూనే ఇప్పటికే వందలాది మంది రిటైర్డ్ ఉద్యోగులు మృతిచెందారని, ఇది ఎంతో బాధాకరమని తెలిపారు. 2017 నుంచి 2024 వరకు రిటైర్ అయిన వారికి 2013 పే రివిజన్ ప్రకారమే గ్రాట్యుటీ, లీవ్ ఎన్కాష్‌మెంట్ చెల్లించారని, ఇప్పుడు 2017 ఆర్పీఎస్ ప్రకారం తేడా మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆడిట్ పూర్తై చెల్లిం పులకు సిద్ధంగా ఉన్న ఫైళ్లను కూడా పెండింగ్‌లో పెట్టడం అన్యాయమన్నారు. అలాగే పీఎఫ్ పెన్షన్ సమస్య లు, డీడీలు చెల్లించినా పెన్షన్ మంజూరు కాకపోవడం, మెడికల్ సదుపాయాల్లో నిర్లక్ష్యం, సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణ అనుమతి లేకపోవడం వంటి అంశాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన సమ్మెలో కూడా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపుపై హామీలు ఇచ్చారని, కానీ అమలు మాత్రం జరగలేదని విమర్శించారు. తమ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే న్యాయం చేయాలని డిపో మేనేజర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కే సమ్మిరెడ్డి, కే సాంబయ్య, రవీందర్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం

మట్టెవాడ, మే 25 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఏఐకెఎస్ వరంగల్ జిల్లా సమితి అధ్యక్షుడు బొడ్డుపెల్లి సాయిలు, కార్యదర్శి చుక్క మొగిలి ఆధ్వర్యంలో వరంగల్ అండర్ బ్రిడ్జి సెంటర్లో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వామినాథన్ ప్రవేశపెట్టిన విధానాలను అమలు పరిచి రైతాంగానికి న్యాయం చేయాలని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, మొక్కజొన్న, వరి ధాన్యము సకాలంలో కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని తూకంలో భూకంలో జరుగుతున్న అవకతవకలు అరికట్టి సరైన తూకం వేసి రైతులకు న్యాయం చేయాలనీ, కేంద్ర ప్రభు త్వం డీజిల్, పెట్రోలుపై పెంచిన ధరల వల్ల రైతులకు ఇబ్బంది కలుగుతుంది కనుక పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి రైతాంగాన్ని ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం ఆర్గనైజర్ సెక్రెటరీ ఎం.ఏ.పాషా, మడ్డి రాజారాం, సారంపల్లి రత్నాకర్ రెడ్డి, చుక్క శోభ, ఆరెల్లి ప్రభాకర్, నిమిషకవి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

వీఓఏల సమ్మెకు ఏఐటియుసి పూర్తిస్థాయి మద్దతు

ఏన్కూరు, మే 25 (పీపుల్స్ డైరీ) : గ్రామ దీపికల న్యాయమైన డిమాండ్స్‌ని ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని విఓఏలకు ఏఐటియుసి ఖమ్మం జిల్లా నాయకులు మంకెన కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విఓఏలు తమ సమస్యలను పరిష్కరించాలని గత 4,రోజులుగా ఏన్కూరు మండల కేంద్రంలో లో దీక్ష చేస్తున్నారు. వారి దీక్ష శిబిరాన్ని సదర్శించి వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భం గా మంకెన కృష్ణ మాట్లాడుతూ విఓఏలు పడుతున్న కష్టానికి తగిన వేతనం 26000 నెలకి ఇవ్వాలన్నారు. పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా 20 లక్షలు ఇవ్వాలని మరియు వారికి ఇబ్బంది కలిగించే మిగతా డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిం చాలని కోరారు. మీ న్యాయమైన డిమాండ్స్ సాధనలో మీ పోరాటానికి అన్ని రకాలుగా ఏఐటియుసి సహాయ సహ కారాలు అందిస్తుందని వారు తెలిపారు. ఈ సంఘీ బావంలో విఓఏ జేఏసీ ఏన్కూరు మండల అధ్యక్షులు జంపాల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి గోరంట్ల చంద్రావతి, మండల ఉపాధ్యక్షులు బందులు శాంతారావు తో పాటు మండ లంలో అన్ని గ్రామాల విఓఏలు దీక్షలో పాల్గొన్నారు.

మహిళా శక్తి భవనానికి శంకుస్థాపన చేసిన ఎంపీడీవో

ఏన్కూర్, మే 24 (పీపుల్స్ డైరీ) : మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో మహిళల అభివృద్ధి, స్వయం ఉపా ధి కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడే మహిళా శక్తి భవనానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో పల్లి భాగ్యశ్రీ భవన నిర్మా ణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సూర్యనారాయణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాంప్రసాద్, రేపల్లెవాడ సర్పంచ్ అజ్మీర సురేష్ నాయ క్, కాంగ్రెస్ నాయకులు నిమ్మల నరేందర్, భువనేశ్వర్ రాజు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వరరావు, సాయిన్ని వీరబాబు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 26 మందికి జరిమాన

మట్టెవాడ, మే 25 (పీపుల్స్ డైరీ): వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 26 మందిని కోర్టులో హాజరుపరచగా వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శ్రీమతి నిధి రాజ్ రూ.28,200 జరిమాన విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కోడూరి సుజాత తెలిపారు

ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను అంబేద్కర్ సంఘానికి అప్పగించాలి

చిట్యాల, మే 25 (పీపుల్స్ డైరీ) : చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ అంబేద్కర్ భవనం ను అంబేద్కర్ సంఘానికి అప్పగించాలని తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలో భారత రాజ్యాంగ రచయిత ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్మారక భవనము నిర్మాణం కోసం కేటాయించిన స్థలంలోఎస్సీ కమ్యూనిటీ హాల్ ను అప్పటి మాజీ తొలి స్పీకర్ మధుసూదనా చారి మంజూరు చేశారని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి కట్టించి ఎంతో అట్టహాసంగా ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి గత ఐదు సంవత్సరాల క్రితం అట్టహాసంగా ప్రారంభించారని తెలిపారు. నాటి నుండి నేటి వరకు ఆ భవనాన్ని అంబేద్కర్ సంఘానికి అప్పగించలేదని అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సంబంధించిన జిల్లా మండల అధికారులు తక్షణమే ఎస్సీ కమ్యూనిటీ హాల్ అంబేద్కర్ భవనాన్ని సంఘానికి అప్పగించాలని లేనియెడల దళిత సంఘాల ఆధ్వర్యంలో దశలవారీగా భవనాన్ని అప్పగించే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అంబేద్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షులు బొట్ల ఆనందం మండల ప్రచార కార్యదర్శి కట్కూరి రాజు మండల నాయకులు గురుకుంట్ల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను సంపూర్ణంగా రూపుమాపుదాం

ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపిఓ విజయ

గోవిందరావుపేట, మే 25(పీపుల్స్ డైరీ) : బాల్యవివాహాలు సామాజిక దురాచారం బాల్యవివాహాలను సంపూర్ణం గా రూపుమాపుదాం ఐసిడిఎస్ ఇన్చార్జి సిడిపిఓ విజయ అన్నారు, మండల పరిధి కోటగడ్డ, గాంధీనగర్ గ్రామ పంచాయతీలలో సంబంధిత గ్రామపంచాయతీ సర్పంచ్ల అధ్యక్షతన బాల్యవివాహాల నిర్మూలించాలని లక్ష్యంతో లక్ష్యంతో సోమవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహిం చారు. విజయ మాట్లాడుతూ గ్రామ సభల ప్రధాన ఉద్దేశం బాల్యవివాహాల నిర్మూలన, బాలికల విద్యా ప్రోత్సహం, గ్రామస్థాయిలో బాల్యవివాహాల వ్యవస్థ ను బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యం అన్నారు, అవసరమైన ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిం దన్నారు సభలో పాల్గొన్న అధికారులు బాల్య వివాహాల వల్ల కలిగే అనాధ అనార్థాల గురించి వివరించడం జరిగింది, ప్రతి ఒక్కరూ ఆడపిల్లలకు వివాహాలు జరిపించే ముందు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు, అలా లేనియెడల బాల్య వివాహాలను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు, బడి మానేసిన బాలికలను పునర్ ప్రవేశం అవగాహన నిర్వాహణ దృష్టి సారించాలన్నారు, గ్రామాలలో బాల్య వివాహ రైతగ్రామంగా తీర్చిదిద్దేందుకు సహకరిస్తామని ప్రతిజ్ఞ చేయడం జరిగిందని అన్నారు, అవగాహన సదస్సులో మహిళలు, పిల్లలు మరియు దివ్యాంగుల సంక్షేమ శాఖ పరిధిలోని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించబడిందన్నారు. గ్రామసభల ప్రధాన ఉద్దేశ్యం బాల్య వివాహాల నిర్మూలన, బాలికల విద్య ప్రోత్సాహం మరియు గ్రామ స్థాయిలో బాలల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడం. గ్రామాన్ని ప్రకటించేందుకు అవసరమైన ప్రమాణాలపై ప్రజలకు అవగాహన కల్పిం చారు. సభలో పాల్గొన్న అధికారులు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించి, ప్రతి వివాహానికి వయస్సు ధృవీకరణ తప్పనిసరి అని సూచించారు. అలాగే గ్రామంలో బాల్య వివాహాలను అడ్డుకునే చర్యలు, స్కూల్ డ్రాప్ అవుట్ బాలికల పునఃప్రవేశం, మరియు అవగాహన కార్యక్రమాల నిర్వహణపై జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు గ్రామ స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగి స్తూ, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. గ్రామసభలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఐసిడిఎస్,జిల్లా బాలల పరిరక్షణ విభా గం నుండి సోషల్ వర్కర్ శ్రీమతి జ్యోతి , అంగన్వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి

వచ్చే వర్షాకాలానికే బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు చేరాలి

డిస్ట్రిబ్యూటరీ కాలువల భూసేకరణలో రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలి

యాతాలకుంట టన్నెల్‌ను పరిశీలించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, మే 25 (పీపుల్స్ డైరీ) : ఆగస్టు 15లోపు యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులను ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామంలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్ ను సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు దివాకర్ టిఎస్, అంకిత్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లను వెంట తీసుకొని మంత్రి స్వయంగా ట్రాక్టర్ నడుపుకుంటూ టన్నెల్ లోపలికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందించడం ఇక్కడి ప్రజల చిరకాల స్వప్నమని అన్నారు. ఏటూరునాగారం నుంచి పాపికొండల వరకు గోదావరి పరివాహక ప్రాంతం ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ఆ జలాలను వినియోగించు కోలేకపోయామని తెలిపారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఖమ్మం సరిహద్దుల వరకు వచ్చినా సిల్ట్ సమస్యలు, ఇతర ప్రాంతాల ఆయకట్టు కారణంగా జిల్లాకు నీరు అందలేదని అన్నారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ కొంత మేర ఉపశమనం ఇచ్చినా, ఖమ్మం జిల్లా ఎత్తైన ప్రాంతంలో ఉండటంతో గోదావరి జలాలను వినియోగించుకోవాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ మాత్రమే మార్గమని తెలిపారు. ఎన్టీఆర్ హయాం నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరకు ప్రతి ముఖ్యమంత్రిని ఖమ్మం జిల్లాకు లిఫ్ట్ ఇరిగేషన్ మంజూరు చేయాలని కోరుతూ పోరాడానని పేర్కొన్నారు. 1997-98లో నాగార్జున సాగర్ నుంచి శ్రీశైలం రైట్ లైన్ కెనాల్ వరకు లిఫ్ట్ పనులను రెండున్నర సంవత్సరాల్లో పూర్తి చేశామని, అదే సమయంలో దేవాదుల, దుమ్ముగూడెం లిఫ్ట్ ప్రాజెక్టులను ప్రతిపాదించామని తెలిపారు. నిధుల కొరత కారణంగా అప్పట్లో దేవాదుల ప్రాజెక్ట్ మాత్రమే ప్రారంభమైందన్నారు. వైఎస్సార్ హయాంలో దుమ్ముగూడెం ప్రాజెక్టును ఇందిరాసాగర్, రాజీవ్ సాగర్ పేర్లతో తీసుకువచ్చారని, రాష్ట్ర విభజన అనంతరం ఇందిరాసాగర్ హెడ్‌వర్క్స్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోవడంతో పాటు అవసరమైన అనుమతులు కూడా లేకపోవడంతో ప్రాజెక్ట్ ముందుకు సాగలేదని అన్నారు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం అప్పటి ముఖ్యమంత్రిపై ఒత్తిడి తెచ్చి దుమ్ముగూడెం ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చామని, ఈ ప్రాంతానికి శ్రీ సీతారాములతో ఉన్న అనుబంధం కారణంగా దీనికి సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టామని తెలిపారు. 2016లో 13 వేల కోట్ల పరిపాలనా అనుమతులు వచ్చినప్పటికీ గత ప్రభుత్వ హయాంలో పనులు చాలా నెమ్మదిగా సాగాయని అన్నారు. 100 కిలోమీటర్ల ప్రధాన కాలువ, మూడు పంప్ హౌస్‌లు మాత్రమే పూర్తయ్యాయని, ప్రస్తుతం నాలుగో పంప్ హౌస్ పనులు కొనసాగు తున్నాయని, వాటిని పూర్తి చేస్తామని చెప్పారు. సత్తుపల్లి బ్రాంచ్‌లో భాగమైన యాతాలకుంట టన్నెల్ ద్వారానే ప్రధాన కాలువ నుంచి నీరు సరఫరా అవుతుందని వివరించారు. గత ప్రభుత్వం టన్నెల్ నిర్మించాలా, పైపులైన్ వేయాలా అనే విషయంలో నిర్ణయం తీసుకోలేదని, భద్రాచలం పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఒత్తిడి తీసుకువచ్చి పెండింగ్ పనులను ప్రారంభించామని తెలిపారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై 10 వేల కోట్లు ఖర్చు చేశామని, మరో 7 నుంచి 8 వేల కోట్లు వెచ్చిస్తే కాలువల పనులు పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి స్థాయిలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. రాజీవ్ లింక్ కాలువను ఆరు నెలల్లో పూర్తి చేశామని, వచ్చే జూన్ నాటికి గోదావరి జలాలతో వైరా ప్రాజెక్టును నింపి లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. యాతాలకుంట టన్నెల్ పూర్తైతే మరో లక్ష ఎకరాలకు గోదావరి జలాలు అందుతాయని పేర్కొన్నారు. యాతాలకుంట టన్నెల్ పనులు 16 నెలల క్రితం ప్రారంభమై, ఏజెన్సీ అధికారులు రాత్రింబవళ్లు కష్టపడి టన్నెల్ నిర్మాణాన్ని పూర్తి చేశారని అభినందించారు. టన్నెల్ లైనింగ్ పనులను కూడా త్వరగా పూర్తి చేయాలని, రెండు వైపులా పనులు వేగవంతం చేయాలని సూచించారు. వచ్చే వర్షాకాలానికే యాతాలకుంట టన్నెల్ ద్వారా గోదావరి జలాలు బేతుపల్లి చెరువుకు చేరాలనేది తన కోరిక అని అన్నారు. ప్రధాన కాలువ భూసేకరణ పూర్తి చేసిన కలెక్టర్ లకు మంత్రి అభినందనలు తెలిపారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల కోసం ఇంకా 11వేల ఎకరాల భూమి అవసరమని, భూసేకరణపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గత ప్రభుత్వం డిస్ట్రిబ్యూటరీ కాలువలను నిర్లక్ష్యం చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం సవరించిన అంచనాలకు ఆమోదం తెలిపిందని తెలిపారు. మొదట పినపాక, తరువాత కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలకు ఈ ఏడాదిలోనే ప్రయోజనం చేకూరుతుందని, కాలువల పనులు త్వరగా పూర్తవ్వాలంటే ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు రైతులతో సమన్వయం చేసి భూసేకరణకు సహకరించాలని కోరారు. యాతాలకుంట టన్నెల్ లైనింగ్ పనులు ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని, ఏ సమస్య వచ్చినా వెంటనే ఎమ్మెల్యేలు, కలెక్టర్ల దృష్టికి తీసుకురావాలని ఏజెన్సీకి సూచించారు. భూమి ఇచ్చిన రైతులకు మంచి పరిహారం అందిస్తున్నామని, ప్రాజెక్ట్ కోసం రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మొత్తం 7 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని, జూలూరుపాడు టన్నెల్ పూర్తైతే పాలేరు వరకు గోదావరి జలాలు చేరుతాయని, ఖమ్మం జిల్లాలో మొత్తం 10 లక్షల ఎకరాలు సాగునీటి పరిధిలోకి వస్తాయని మంత్రి తెలిపారు. జూలూరుపాడు టన్నెల్ టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందని, యాతాలకుంట టన్నెల్ లైనింగ్ అనంతరం జూలూరుపాడు టన్నెల్ పనులు వేగవంతం అవుతాయని అన్నారు. భూసేకరణ సమస్యలను త్వరగా పరిష్కరించి పనులు పూర్తి చేయాలని సూచించారు. డిస్ట్రిబ్యూటరీ కాలువల పనులు స్థానిక ఎమ్మెల్యేలు, రైతుల సహకారంపైనే ఆధారపడి ఉన్నాయని చెప్పారు. గోదావరి జలాలు అందితే ఆయిల్‌పామ్ సాగు విస్తృతంగా పెరుగుతుందని, రైతుల ఆదాయం గణనీయంగా పెరుగుతుందని మంత్రి తెలిపారు. ఉద్యాన పంటలకు తక్కువ నీరు సరిపోతుందని, ఒక ఎకరం వరి సాగు నీటితో ఐదు ఎకరాల ఆయిల్‌పామ్ సాగు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. వరి సాగులో ఎరువులు, మార్కెటింగ్, అకాల వర్షాలు రైతులను ఇబ్బంది పెడుతున్నాయని అన్నారు. దేశంలో ప్రతి పంటను కొనుగోలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని, వరి, మొక్కజొన్న, జొన్నలు, సన్‌ఫ్లవర్ వంటి పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ధాన్యం కొనుగోళ్లు ఆలస్యమవుతున్నా యని విమర్శించారు. డీజిల్ సరఫరా, హమాలీల కొరత, గన్నీ బ్యాగుల సరఫరా తగ్గినా తెలంగాణ దేశంలో అత్యధిక ధాన్యం కొనుగోలు చేస్తున్న రాష్ట్రంగా నిలిచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం కనీస మద్దతు ధర ప్రకటిస్తోందే తప్ప పంటలను కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. రైతుల సమస్యలను రాజకీయాలకు ఉపయోగించు కోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏసిపి వసుంధర, ప్రజా ప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, రైతులు, సంబంధిత అధికారులు, తదితరులున్నారు.

లక్ష్మారెడ్డిపల్లిలో కారు ఢీకొని వృద్ధుడి మృతి

గణపురం, మే 25 (పీపుల్స్ డైరీ) : అతివేగం మరో ప్రాణాన్ని బలితీసుకుంది. గణపురం మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బొక్కల ఐలయ్య (75) వ్యక్తిగత పనిమీద కాలినడకన 353 జాతీయ రహదారి వెంట వెళ్తున్నాడు. ఈ క్రమంలో పరకాల వైపు నుంచి భూపాలపల్లి దిశగా అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి ఐలయ్యను బలంగా ఢీకొట్టింది. ఢీకొట్టిన తీవ్రతకు ఆయన రోడ్డుపైనే పడిపోయి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న గణపురం పోలీసులు పరిస్థితిని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

వెలుగు ఆఫీస్‌కు భూమిపూజ చేసిన సర్పంచ్

నర్సింహులపేట, మే 25 (పీపుల్స్ డైరీ): గ్రామ అభివృద్ధిలో భాగంగా వెలుగు ఆఫీస్ (వీవో) భవన నిర్మాణానికి సోమవారం భూమిపూజ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మా లోతు బాలునాయక్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. గ్రామంలో మహిళా సంఘాల కార్యకలాపాల నిర్వహణకు ఈ కార్యాలయం ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉమారాణి, సీసీ రమణమ్మ, సీఏ శశిరేఖ, వివో అధ్యక్షురాలు అలువాల రేణుక, సభ్యులు సుజాత, వెంకటలక్ష్మి, వార్డు సభ్యురాలు లింగమ్మ, గ్రామ పెద్దలు బోళ్ల సంజీవరెడ్డి, పోలోజు శ్రీనివాస చారి పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వెలుగు ఆఫీస్ నిర్మాణంతో గ్రామంలో మహిళా సంఘాల సమావేశాలు, సంక్షేమ కార్యక్రమాల నిర్వహణ మరింత సులభతరం కానుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

ఖమ్మం, మే 25 (పీపుల్స్ డైరీ) : ప్రజలు సమర్పించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరే ట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. వేంసూరు మండలం భీమవరం గ్రామానికి చెందిన కంచపోగు సురేష్ తన కుమారుడు అభిషేక్ కు బెస్ట్ అవైలబుల్ స్కూల్ లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా ఎస్సి అభివృద్ధి అధికారికి రాస్తూ నిబంధన ప్రకారం అవసరమైన చర్యలు తీసుకో వాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం, అల్లిపురం గ్రామానికి చెందిన పి.భవాని తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పిడి హౌసింగ్ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం తిమ్మారావుపేట గ్రామానికి చెందిన ఆంజనేయులు తన తాతగారికి సర్వే నెంబర్ 30 లో 9 ఎకరాల 38 గుంటలు భూమి ఉందని, అందులో నాలుగు ఎకరాల 38 గుంటల భూమి వేరే వ్యక్తి మీద పట్టా అయిందని అది రద్దు చేసి తమ భూమి తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ

అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్, తదితరులున్నారు.

వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దు - కలెక్టర్ దివాకర టిఎస్

ఖమ్మం, మే 25 (పీపుల్స్ డైరీ) : జిల్లాలో తీవ్ర ఎండలు, వడగాలులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదు అవుతున్నందున, ముఖ్యంగా ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని సూచించారు. వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఎండ తీవ్రత వల్ల వడదెబ్బకు గురయ్యే ప్రమాదం అధికంగా ఉండడంతో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలు తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు, నిమ్మరసం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, పుచ్చకాయ, దోసకాయ వంటి నీటి శాతం అధికంగా ఉండే పండ్లను తీసుకోవాలని తెలిపారు. బయటకు వెళ్లే సమయంలో గొడుగు, టోపీ, తడి గుడ్డ వంటివి ఉపయోగించాలని, పలుచటి, లేత రంగు దుస్తులు ధరించాలని సూచించా రు. వీలైనంత వరకు చెట్ల నీడలో లేదా చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. భారీ భోజనాలు, మద్యం, కాఫీ వంటి డీహైడ్రేషన్‌కు కారణమయ్యే పానీయాలను నివారించాలని, చిన్నపిల్లలను వృద్ధులను ఎండలో ఎక్కువసేపు ఉంచవద్దని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే పార్క్ చేసిన వాహనాల్లో పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదిలి పెట్టవద్దని సూచించారు. వడదెబ్బ లక్షణాలైన అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వాంతులు, అలసట, చెమట ఆగిపోవడం, స్పృహ కోల్పోవడం వంటి సమస్యలు కనిపిస్తే వెంటనే బాధితులను చల్లని ప్రదేశానికి తరలించి, చల్లటి నీటితో శరీరాన్ని తడపాలని తెలిపారు. ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలని, అవసరమైతే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

గాలివాన బీభత్సం

విరిగిపడిన చెట్లు, స్తంభాలు

ఏన్కూరు మే 25 (పీపుల్స్ డైరీ) : ఏన్కూరు ,కొనిజర్ల మండలాల్లో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. గాలి,వాన మూలంగా కొనిజర్ల మండలం పల్లిపాడు నుంచి గుబ్బగుర్తి వరకు రోడ్డు కిరువైపులా చెట్లు ,స్తంభాలు పడిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు .ఏన్కూరు మండలంలో కూడా అక్కడక్కడ చెట్ల కొమ్మలు,విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.జన్నారంలో విద్యుత్ స్తంభం విరిగిపడింది. కేసుపల్లి టి ఎల్ పేట గ్రామాల్లో చెట్లు, స్తంభాలు పడిపోయాయి. ఇళ్లపై రేకులు లేచి పోయాయి. ఉరుములు మెరుపులతో వర్షం కురిసింది. నెల రోజుల నుంచి మండుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అయిన ప్రజలు గాలివాన రాకతో కాస్తా ఉపశమనం పొందారు రోహిణి కార్తెరోజే వర్షం కురిసింది. గాలి ,వాన మూలంగా విద్యుత్ సరఫరా లో అంతరాయం కలిగింది.

ప్రభుత్వ పాఠశాలలో బోర్ ఏర్పాటు

పినపాక, మే 25,(పీపుల్స్ డైరీ) : పినపాక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక సర్పంచ్ అలివేలు బోరు ఏర్పాటు చేశారు. సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు బోర్ వేయించినట్లు తెలిపారు.విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా ఉపాధ్యక్షులు గొడిశాల రామనాథం,స్థానిక సర్పంచ్ అలివేలు, ఉప సర్పంచ్ తిరుపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్ , పంచాయతీ సెక్రటరీ చంద్ర కుమార్ , స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎండకు బలి.. గొర్రెల కాపరి మృతి

మేతకు వెళ్లి తిరిగిరాని సాంబయ్య

పొలంలో విగతజీవిగా కనిపించిన ఘటనతో గ్రామంలో విషాదం

గణపురం, మే 25 (పీపుల్స్ డైరీ) : మండుతున్న ఎండలు మరో ప్రాణాన్ని బలితీసుకున్నాయి. వడదెబ్బ తాళలేక ఓ గొర్రెల కాపరి పొలంలోనే కుప్పకూలి మృతి చెందిన విషాద ఘటన మండలంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నగరంపల్లి గ్రామానికి చెందిన కొడారి సాంబయ్య(52) ఆదివారం ఉదయం తన గొర్రెలను మేత మేపేందుకు గ్రామ సమీపంలోని చిన్నమాటు ప్రాంతానికి వెళ్లాడు. రోజంతా మండుటెండలోనే గొర్రెల వెంట తిరిగిన సాంబయ్య తీవ్ర వడదెబ్బకు గురై సాయంత్రం సమయంలో అక్కడికక్కడే కుప్పకూలినట్లు తెలుస్తోంది. సాయంత్రం అయ్యాక గొర్రెలు మాత్రమే ఇంటికి చేరుకోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. సాంబయ్య మాత్రం ఇంటికి రాకపోవడంతో రాత్రంతా బంధువులు, గ్రామస్తులతో కలిసి పరిసర ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ లభించలేదు. కాగా సోమవారం ఉదయం మోరంచవాగు సమీపంలోని ఓ పొలంలో సాంబయ్య మృతదేహం పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ వార్తతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భూపాలపల్లి ప్రధాన ఆసుపత్రికి తరలించారు. సాంబయ్యకు భార్య రమతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న వ్యక్తి మృతిచెందడంతో ఆ ఇంట తీవ్ర విషాదం నెలకొంది. వడదెబ్బతో మృతి చెందిన సాంబయ్య కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సర్పంచ్ కొడారి హైమావతి ధనుంజయలు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.

కోడికీ కూలర్ అలవాటు అయ్యిందా..?

గణపురం, మే 25 (పీపుల్స్ డైరీ) : ఎండలు ఏ స్థాయిలో మండిపోతున్నాయో చెప్పేందుకు ఇది ప్రత్యక్ష ఉదాహరణ. ఇప్పటివరకు మనుషులు మాత్రమే కూలర్లు, ఫ్యాన్లు, ఏసీల కోసం పరుగులు పెడుతుండగా.. ఇప్పుడు జంతువులు, పక్షులు కూడా చల్లదనం కోసం వెతుక్కుంటున్నాయి. మండలంలోని లక్ష్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పెంచాల లింగయ్య వద్ద కోడి కూలర్ ముందు కూర్చొని చల్లని గాలిని ఆస్వాదిస్తున్న దృశ్యం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రస్తుతం ఈ ఘటన గ్రామంలో హాట్ టాపిక్‌గా మారింది. మండుతున్న ఎండలతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. మధ్యాహ్నం వేళ రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఓ ఇంటి ముందు ఏర్పాటు చేసిన కూలర్ దగ్గరకు వచ్చిన కోడి, చల్లని గాలి తగలడంతో అక్కడే హాయిగా కూర్చుంది. కొద్దిసేపటికి వెళ్లిపోతుందని భావించిన ఇంటి యజమానులు ఆశ్చర్యపోయేలా.. అది చాలాసేపు కూలర్ ముందే ఉండిపోయింది. అప్పుడప్పుడూ రెక్కలు విప్పుతూ, మెడను పైకెత్తుతూ గాలిని ఆస్వాదించడం చూసి స్థానికులు నవ్వులు పూయించారు. ఈ దృశ్యాన్ని చూసిన యువకులు సెల్‌ఫోన్లలో వీడియోలు చిత్రీకరించి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో విషయం చర్చనీయాంశమైంది. "ఇంత ఎండల్లో మనుషుల పరిస్థితి ఇలా ఉంటే.. మూగజీవాల

కూలర్ ముందు కూర్చొని చల్లదనం ఆస్వాదిస్తున్న కోడి

పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలి" అంటూ పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. మరికొందరు "కోడికీ కూలర్ అలవాటు అయిపోయిందేమో" అంటూ సరదాగా మాట్లాడుకుంటున్నారు. ఇక మండలంలో రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచే ఎండలు మండిపోతుండగా.. మధ్యాహ్నానికి రోడ్లన్నీ నిప్పుల

కూలర్ గాలిని ఆస్వాదించిన కోడి...
ఎండల వేడికి జంతువులూ విలవిల
మనుషులే కాదు.. కోళ్లకూ హీట్ టెన్షన్
ఎండల తీవ్రతకు మూగజీవాల అవస్థలు
లక్ష్మారెడ్డిపల్లిలో హాట్ టాపిక్‌గా కోడి కథ
'ఇక కోళ్లకూ ఏసీలు పెట్టాలేమో' అంటూ సోషల్ మీడియాల పేలుతున్న జోకులు

కొలిమిలా మారుతున్నాయి. చెట్లు, నీడల దగ్గర పశువులు, పక్షులు ఆశ్రయం పొందుతున్నాయి. కొంతమంది గ్రామస్తులు ఇంటి ముందర నీటి పాత్రలు ఏర్పాటు చేసి పక్షులకు తాగునీరు అందిస్తున్నారు. "ప్రకృతి మార్పులతో ఎండల తీవ్రత పెరిగిపోతోంది. మనుషులే కాదు.. జంతువులు, పక్షులపైనా దాని ప్రభావం తీవ్రంగా పడుతోంది" అని స్థానిక పెద్దలు చెబుతున్నారు. గణపురంలో కోడి కూలర్ ముందు చిల్ అవుతున్న ఈ అరుదైన దృశ్యం మాత్రం అందరినీ ఆకట్టుకుంటోంది.

చెరువుల గర్భంలో 'మట్టి మాఫియా'?

నర్సింహులపేట మండలంలో అక్రమ ఒండ్రుమట్టి తవ్వకాల ఆరోపణలు

నర్సింహులపేట, మే 25 (పీపుల్స్ డైరీ) : మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలో చెరువుల నుంచి ఒండ్రుమట్టి అక్రమంగా తవ్వి ఇటుక బట్టీలకు తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. చెరువుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్న వేళ, సంబంధిత శాఖలు స్పందించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం మండలంలోని పెద్దనాగారం ముత్యాలమ్మ చెరువు, జయపురం అక్కిరాల చెరువు, నర్సింహులపేట పెద్దచెరువు, వంతడుపల, చిల్లంచెర్ల గ్రామాల పరిధిలోని పలు చెరువుల వద్ద రాత్రి వేళల్లో భారీ యంత్రాలతో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. అనంతరం ట్రాక్టర్ల ద్వారా మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నట్లు చెబుతున్నారు.

జేసీబీలతో తవ్వకాలు.. వందల ట్రాక్టర్లతో తరలింపు?

గ్రామస్థుల ఆరోపణల ప్రకారం, చెరువుల్లోని జిగుట ఒండ్రుమట్టి ఇటుకల తయారీకి అనుకూలంగా ఉండటంతో వ్యాపారులు

రాత్రింబవళ్లు జేసీబీల గర్జన..
ఇటుక బట్టీలకు చెరువు మట్టి తరలింపుపై గ్రామస్తుల ఆందోళన
ఎద్దనాగారం నుంచి చిల్లంచెర్ల వరకు చెరువులే లక్ష్యమంటూ ఆరోపణలు
అధికారుల నిర్లక్ష్యంపై మండిపడుతున్న రైతులు

భారీ స్థాయిలో సేకరిస్తున్నారని అంటున్నారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు తిరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే పెద్ద మొత్తంలో మట్టిని నిల్వ చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే ఈ సంఖ్యలు, పరిమాణాలపై అధికారిక నిర్ధారణ వెలువడాల్సి ఉంది.

రైతుల ఆందోళన

రైతులకు ఉపయోగపడాల్సిన ఒండ్రుమట్టి వాణిజ్య

వినియోగానికి వెళ్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. చెరువుల లోతు, నిల్వ సామర్థ్యం, భూగర్భ జలాలపై దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశం ఉందని గ్రామస్థులు చెబుతున్నారు.

అధికారులపై ప్రశ్నలు

ఇరిగేషన్, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సమన్వయంతో పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు చేస్తున్నారు.

తక్షణ విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాలని, చెరువుల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దోమలు బాబోయ్.. దోమలు

నల్లబెల్లి, మే 25 (పీపుల్స్ డైరీ) : ప్రజలు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా దోమ కాటు నుంచి తప్పించుకో లేకపోతున్నారు. అధికారులు నిర్లక్ష్య ధోరణిని వీడి, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో డ్రైనేజీ కాలువలు పొంగి రోడ్ల పైన, డ్రైనేజీ నీరు చేరి దోమలకు ఆవాసాలుగా మారాయి .దోమల స్వైర విహారం ఎక్కువైందని, గ్రామాల్లో దోమల బెడద పోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఉదయం, రాత్రి జనానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నా అధికారులకు పట్టడం లేదు. ఆపై వీధివీధిలోనూ దోమలు రయ్ రయ్ మంటూ స్వైర్య విహారం చేస్తూ ఇంట్లోకి వచ్చేస్తున్నాయి. జనం నానా అవస్థలు పడుతున్నా, అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. దోమ కాట్లతో కాళ్లు, చేతులు మండిపోతున్నాయిని వాపోతున్నారు. గ్రామాల్లోని డ్రైనేజీ కాలువల్లో నీరు నిల్వ ఉండి, దోమలు స్వైరవిహారం చేయడంతో, వైరల్ జ్వరాలు వెంటాడుతున్నాయి. దీంతో పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రులపాలై జేబులకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి దాపురిస్తుంది. మండలంలోని గ్రామాల, ప్రజలు జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. దోమల భయానికి సాయంత్రం 6 గంటలకే తలుపులు వేసేసుకుంటున్నారు. ప్రజలు వారి నివాసాల్లో దోమల నియంత్రణ మందులు ఎన్ని వాడుతున్నా, ఫలితాలు కనిపించడం లేదని గ్రామాల్లో ప్రజలు వాపోతున్నారు.వర్షాకాలం మొదలవడంతో పరిసరాలన్ని గడ్డి, చిన్న చిన్న మొక్కలతో పచ్చగా మారిపోయాయి. ధీంతో పాటే దోమలు కూడా విపరీతంగా పెరిగిపోయి మనుషుల మీద దండ యాత్ర చేస్తున్నాయి. వాటిని లార్వా దశలోనే నిర్మూలించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో అవి మరింతగా వృద్ధి చెందాయి. నల్లబెల్లి మండల కేంద్రంలో దోమలు వీర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. కొన్ని రోజులుగా దోమల బెడద ఎక్కువైందనీ, వీటి నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమల నివారణపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీ మురుగునీరు పారుదల ముందుకు సాగే విధంగా లేకపోవడంతో, దోమలు వాటిని ఆవాసంగా చేసుకొని, ప్రజలు రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో దోమలు విజృంభిస్తుండడంతో డ్రైనేజీ కాలువల వద్ద పిచికారీ, ఫాగింగ్ చేసి, దోమలను అరికట్టాలని,

డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రబలే అవకాశం
దోమల విజృంభణతో ప్రజలు బెంబేలు
దోమలకు ఆవాసంగా డ్రైనేజీ కాలువలు
ప్రజల ఆరోగ్యం పై నిర్లక్ష్య ధోరణిలో అధికారులు
జ్వరపీడిత లతో ఆసుపత్రులు కిటకిట
అధికారులు స్పందించాలని విన్నపం
ప్రభుత్వం మారినా.. అధికారుల తీరు మారదా..?

సాయంత్రం అయ్యిందంటే చాలు దోమలు విపరీతంగా వస్తున్నాయని సాయంత్రం వేళలలో ఫాగింగ్ చేయాలని, అధికారులు స్పందించి దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.వర్షాలు కురుస్తుండడంతో, నీటి నిల్వలు పెరిగిపోతున్నాయి. గతం లో ఫిర్యాదు చేయగా ఒకసారి ఫాగింగ్ చేశారని, మళ్ళీ నాలుగైదు నెలలుగా ఒక్కసారి కూడా ఫాగింగ్ చేయడం లేదని వాపోతున్నారు. పగలు, రాత్రి అని లేకుండా స్వైర విహారం చేస్తూ.. ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. మండలంలో ఎక్కిడకక్కడ నీరు నిలిచిపోతోంది. పారిశుధ్య నిర్వహణ అంతంతమాత్రంగానే ఉంది. దీంతో దోమలు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే చాలామంది మలేరియా, టైఫాయిడ్ వైరల్ జ్వరాలతో ఆసుపత్రుల్లో చేరుతున్నారు. డ్రైనేజీ లు ఇంటి పరిసరాల్లో, ఉన్న గుంతలలో నీరు నిలువ ఉండడంతో, అక్కడ ఆవాసాలు ఏర్పాటు చేసుకొని, వృద్ధి చెందుతున్నాయి. వర్షాలకు పారిశుద్ధ్య పరిస్థితి అద్వానంగా మారుతుంది. మురికి కాలువలు గుంతలు నీటి నిలువలు కేంద్రాలు, దోమల ఉత్పత్తికి నిలయాలుగా మారుతున్నాయి. గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పగలు రాత్రి అని తేడా లేకుండా జలగల్లాగా పట్టిపీడిస్తున్నాయి. పలు కాలనీల్లో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది. దోమల నివారణకు ప్రతి ఇళ్లల్లో కాయిల్స్, లిక్విడ్ సీసాల వినియోగానికి వందల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. అయినా దోమల బెడద పోవడం లేదు.అసలే వర్షాకాలం, అపరిశుభ్రత ఆపై చీకటి పడితే చాలు, ఏ వార్డుకి వెళ్ళినా

దోమల మోత వినిపిస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు రోజురోజుకూ వ్యాధిగ్రస్థుల సంఖ్య పెరుగుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల పరిశుభ్రత లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛభారత్, కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్న, మండల అధికారులు మాత్రం ఆ దిశగా దృష్టి సారించడం లేదు అని చర్చించుకుంటున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి, ప్రజల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని, అన్ని గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుధ్య కార్మికులను నియమించడం లేదు. దీంతో ఈ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతోంది. వర్షాలు కురిసే సమయంలోనూ కాలువల నిర్వహణపై అధికార యంత్రాంగం దృష్టి సారించడం లేదు. కాలనీల్లో కాలువల్లో మురుగునీరు కదలడం లేదు. దీంతో దోమలు బెడద ఎక్కువవుతుండగా, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, చికెన్ గున్యా తదితర వ్యాధుల బారిన పడుతున్నవారి సంఖ్య పెరుగుతుంది. ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. అధికారులు, పాలకవర్గ సభ్యులు పరిశుభ్రత, దోమల నివారణపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి

పారిశుద్ధ్య లోపాలే దోమల పెరుగుదలకు కారణం

కాలనీల్లో డ్రైనేజీలు పొంగిపొర్లడం, మురుగు నీరు నిలిచిపోవడం, చెత్త ఎప్పటికప్పుడు తొలగించకపోవడం వల్ల దోమల పెరుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. వర్షాలు తగ్గిన డ్రైనేజీల్లో నీరు నిలిచి ఉండడం వల్ల దోమలు మరింత పెరుగుతున్నాయని చెబుతున్నారు

దోమల మందు పిచికారీ చేయాలి

గ్రామంలో దోమల నివారణకు దోమల మందు ను పిచికారీ చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వీధుల్లో, చెత్త వేసే ప్రాంతాల్లో, నీరు నిలువ ఉండే ప్రాంతాలు, మురికి కాలువ చుట్టూ దోమ నివారణకు స్ప్రేలు పిచికారీ చేయాలనీ కోరుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు.

– మర్రి రాజు యాదవ్.. గ్రామస్థుడు

వైరల్ ఫివర్‌లు వచ్చే అవకాశం

అసలే వర్షాకాలం కావడంతో సాధారణంగా వైరల్ ఫివర్‌లు వస్తుంటాయి. పైగా దోమలు ఎక్కువవ్వడంతో డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు ప్రభలే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు.గ్రామంలో గ్రామం చుట్టూ పక్కలా చెత్త కుప్పలు, మురికి నీటి ప్రవాహాలు ఉండడంతో పాటు, పిచ్చి మొక్క లు కూడా విపరీతంగా పెరిగాయని ఇవన్నీ దోమలు పెరగడానికి కారణమాయ్యాయని, వీటిని తొలిగించాలని అధికా రులను గ్రామస్తులు కోరుతున్నారు. ఫాగింగ్‌తో పాటు, దోమల నివారణకు మందులను పిచికారీ చేయాలని వారు కోరుతున్నారు.

– బత్తిని రాజ్ కుమార్ యాదవ్ – గ్రామస్థుడు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT SATYANARAYANA PRINTERS, H.NO.4-6-144, TILAK ROAD, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA, STATE. PUBLISHED AT H.NO. 10-3-488, OPP: RTC WORK SHOP, KARIMNAGAR-505001, KARIMNAGAR DISTRICT, TELANGANA STATE,
EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044, e-mail : peoplesdairydaily@gmail.com